

22 ఇసుక ర్యాంపులు.. 4.95 లక్షల టన్నుల ఇసుక

» కొవ్వూరులో మరో 8 డీసిల్టేషన్ ర్యాంపులు
» ఉచితంగా ఇసుక తీసుకెళ్లండి : కలెక్టర్

రాజమహేంద్రవరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 22 ర్యాంపుల్లో 4 లక్షల 95 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆమె ఒక ప్రకటన విడుదల చేశా రు.రాజమహేంద్రవరం అర్బన్ వినియోగదారులుకు కోటిలిం గాల ర్యాంపులో, ధవళేశ్వరంలోని గాయత్రి ర్యాంపులలో ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇంటి నిర్మాణం కోసం ఇంటి ప్లాన్, ఇతర ఇంటి మరమ్మతుల కోసం గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా ధ్రువపత్రం పొందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకుని వెళ్లవచ్చని చెప్పారు. కొత్తగా కొవ్వూరు డివిజన్‌లో మరో 8 డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుక తీతకు అనుమతి ఇచ్చామని చెప్పారు. శుక్రవారం నుంచి ఇక్కడ 7,21,500 టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 16 ఓపెన్ రీచ్‌లలో 11,13,450 మెట్రిక్ టన్నుల ఇసుక ఉందన్నారు. కొవ్వూరు డివిజన్‌లో 2,52,500 టన్నులు, రాజమహేంద్రవరం డివిజన్‌లో 2,43,500 టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. కొత్తగా వాడపల్లి రీచ్‌లో 60 వేల టన్నులు,ఔరం గా బాద్-2లో 90 వేలు, ఎరినమ్మ రీచ్‌లో 37,500, కొవ్వూరులో 15 వేలు,దండగుంట రేవులో 45 వేల టన్నుల ఇసుక ఉందన్నారు.

పేదింట దీపం పెట్టారు!

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజమహేంద్రవరంలో మహిళలు జైకొట్టారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో మహిళలు దీపం-2 పథకంపై పాల బిందెలు పట్టుకుని ఊరేగింపు చేశారు. ర్యాలీగా కోటిపల్లి బస్టాండ్‌కు చేరుకుని చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన దూసుకువెళుతుందన్నారు. మజ్జి పద్మావతి మాట్లాడుతూ దీపం -2 పథకం మహిళలకు ఒక వరం అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లా తనూజ, దండమూడి ప్రమీల, ముత్తాబత్తుల విజయ్, గొందేశి మాధవీలత, ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, టీడీపీ అధ్యక్షుడు మత్స్యేటి సత్యప్రసాద్, రాష్ట్ర రైతు నాయకులు మార్గాని సత్యనారాయణ, నిమ్మలపూడి గోవింద్, శీలం గోవింద్, బూరా దుర్గాంజనేయరావు, రొంపిచర్ల అంటోని, యార్లగడ్డ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




రాజమహేంద్రవరంలో మహిళల ర్యాలీ

ఉచిత సిలిండర్లు 3,59,462 డెలివరీ

రాజమహేంద్రవరం,నవంబరు 7 (ఆంధ్రజ్యో తి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన దీపం-2 పథకం కింద జిల్లాలో ఇప్పటికే 43 ఏజెన్సీల ద్వారా ఉచిత సిలిండర్‌కు 4,02,331 బుకింగ్‌లు రాగా 3,59, 462 మందికి గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసినట్టు జేసీ ఎస్.చిన్న రాముడు తెలిపారు.ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి 31వతేదీ లోపు మొదటి ఉచిత సిలిండరు పొం దవచ్చని చెప్పారు. సిలిండర్ డెలివరీ పొందిన 48గంటల్లో సొమ్ము లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతా లో జమవుతుందన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1967ను సంప్రదించవచ్చని చెప్పారు.



చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చిత్రంలో గోరంట్ల




గోపవరం గ్రామశివారులో ఉన్న ఉడతల కొండ

రెవెన్యూలో అన'కొండ'లు

» గత ప్రభుత్వంలో సబ్ డివిజన్ పేరిట భూమాయ
» గోపాలపురంలో విచారణకు ఆదేశించిన కలెక్టర్

గోపాలపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కొండలపై కన్నేశారు.. కోట్లు దండారు.. మండలంలోని కోమటిగుంట, గంగోలు, భీమోలు, గోపవరం గ్రామాల్లో కొండలు విస్తరించి ఉన్నాయి.రెవెన్యూ అధికారులు కొందరు వ్యక్తుల పేరిట లేని భూమిని ఉన్నట్టుగా చూపించి కోట్లు దండుకున్నట్టు సమాచారం. గంగోలు మాధవాయకొండ సర్వే నెంబరు 904లో 383.80 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా సబ్ డివిజన్ల పేరుతో 106 ఎకరాలు పెంచి మాధవాయికొండను 466 ఎకరాలు విస్తరించినట్టు రికార్డుల్లో చూపించారు. కోమటిగుంట రెవెన్యూ పరిధిలో ఉన్న మాతంగమ్మ మెట్టపై సర్వే నెంబరు 1-2లో 230 ఎక రాల ప్రభుత్వ భూమి ఉంది.ఆ సర్వే నెంబర్‌లో సబ్ డివిజన్ల పేరుతో 98 ఎకరాలు పెంచి మాతంగమ్మ మెట్టను 350 ఎకరాలకు విస్తరించి రికార్డులో నమోదు చేశారు. గంగోలు పెదకొండ సర్వే నెంబరు 637లో 380 ఎకరాలు భూమి ఉండగా ఆ సర్వే నెంబర్‌లో సబ్‌డివిజన్ చేసి 200 ఎకరాలు భూమిని పెంచి ఆ కొండను 556 ఎకరాలకు పెంచారు.భీమోలుకొండ చెప్పనక్క ర్లేదు ఆయా సర్వే నెంబర్‌లో 8 నుంచి 12 వర కు సబ్‌డివజన్ల పేరుతో ఆ ప్రాంతాన్ని 15 భాగాలుగా విభజించి ఇష్టారాజ్యంగా రికార్డులు మార్చేశారు.ఎఫ్ఎల్ఆర్‌లో ఉన్నభూమికి ప్రస్తుత రికార్డులో పెంచిన భూమికి పొంతన లేకుండా చేసేశారు.ఈ విషయం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి రావడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ప్రభుత్వం నేరుగా కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వడంతో విచారణకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ మేరకు గత ప్రభుత్వంలో పనిచేసిన తహశీల్దార్ రవీంద్రనాథ్,డీటీ కృష్ణ, తహశీల్దార్ వనజాక్షి, డీటీ ప్రదీప్‌లపై విచారణకు ఆదేశించారు.విచారణ కమిటీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇద్దరు డీటీలను నియమించినట్టు తెలిసింది. రేపో మాపో కమిటీ రంగంలోకి దిగితే తమ భవిష్యత్తు ఏమిటోనని గత అధి కారులంతా తలలు పట్టుకుంటున్నారు. కాసు లు చెల్లించి సబ్ డివిజన్‌లో పట్టాలు పొందిన వారంతా లబోదిబోమంటున్నారు.



ఇష్టానుసారం.. ఇచ్చేశారు!

పంచాయతీల్లో అడ్డగోలు నియామకాలు

» 100 మందికి పైగా పోస్టులు
» 10 పంచాయతీల్లో ఇదీ లెక్క
» ఇక జిల్లా వ్యాప్తంగా ఎంతో?
» గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యం
» ఉన్నతాధికారుల వద్దే వివరాల్లేవ్
» ప్రభుత్వం మారినా మారని తీరు

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అధికారుల ఇష్టారాజ్య మైపోయింది..చాలా మంది ఉన్నతాధికారులకు తెలియకుండానే ప్రభుత్వ ఉద్యోగులుగా చలామణి అయిపోతున్నారు.అయినా చూస్తూ ఉండిపోవడం తప్ప ఉన్నతాధికారులు ఏం చేయలేకపోతున్నారు. జిల్లా కేంద్రంలో కలిసి ఉండే రూరల్ మండలం పరిధిలో గల 10 పంచా య తీల్లో ఎంతమంది పనిచేస్తున్నారో మండల, డివిజనల్, జిల్లా స్థాయి అధికారులకు తెలియ కపోవడమే దీనికి నిదర్శనం.. ప్రతి నెల ఈవోపీఆర్డీ ప్రతి మూడు నెలలకు డివిజనల్ పంచాయతీ అధికారి,సంవత్సరానికోసారి జిల్లా పంచాయతీ అధికారి ఆయా గ్రామ పంచాయతీలను సందర్శించి జమ ఖర్చుల వివరాలతో పాటు గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై తనిఖీ చేయాలి. కానీ సంబంధిత అధికారులు అవేమి పట్టించుకోకుండా కార్యాల యాలకు రికార్డులను తెప్పించుకుని కళ్లు మూసుకుని సంతకాలు పెట్టేస్తున్నారు. దీంతో కింది స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా మారిపోయింది.ఆయా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు, బోర్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది, బిల్లు కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు ఉన్నారనే కనీస సమాచారం ఉండడంలేదు. అంతే కాదు ఎంత మందికి జీతాలు చెల్లిస్తున్నారో కూడా తెలియకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.ఇదే అదునుగా పంచాయతీల్లో అడ్డగోలుగా నియామకాలు జరిగిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూరల్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో సుమారు 100 పైగా పోస్టులను సృష్టించి అధికార పార్టీ నాయకుల సిఫారసులతో కొంతమంది కార్యదర్శుల మనుషులను నియమించుకున్నట్టు సమాచారం.ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారుల నుంచి పోస్ట్ నియామక ఉత్తర్వులు తెచ్చుకున్న సంఘటనలు వున్నాయి. రూరల్ మండలం పరిధిలో సుమారు 100 మంది వరకు ఉంటారని అంచనా ఒక్క హుకుంపేట గ్రామంలోనే 2019-24 మధ్యలో 20 మందిని నియమించుకున్నట్టు తెలిసింది. అదీ నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్టు సమాచారం. ఎటువంటి అర్హత చూడకుండా ఈ నియామకాలు జరిగినట్టు తెలిసింది. హుకుంపేట పంచాయతీకి చెందిన ఒక వ్యక్తి పంచాయతీ రాజ్ కమిషనర్‌కు తమ గ్రామంలో ఇష్టానుసారంగా సిబ్బందినినియమించుకొని ప్రభుత్వదనాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయ డంతో ఆఘమేఘాలపై గురువారం ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్ పంచాయతీలో సిబ్బంది వివరాలు తెలుసుకుంటున్నారు.దీనిపై రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవోను ప్రశ్నించగా 10 గ్రామాల్లో 629 మంది పనిచేస్తున్నట్టు చెబుతున్నారు.అయితే క్షేత్రస్థాయిలో మరి కొంత మంది అనధికారికంగా పనిచేయడం కొసమెరుపు.

మాకు సమాచారం ఉండదు..

10 పంచాయతీల్లో ఎంత మంది పనిచేస్తున్నారో ఆయా పంచాయతీ కార్యదర్శులకే తెలుస్తుంది.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శుల నుంచి లెక్క తీసుకుంటున్నాం.
- ఆర్మ్‌స్ట్రాంగ్, ఈవోపీఆర్డీ

మా వద్ద డేటా లేదు..

జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారనే ఖచ్చితమైన డేటా మా వద్దలేదు. అవసరం మేరకు ఆయా పంచాయతీలే సిబ్బందిని నియమిస్తాయి..ఇక పంచా యతీల్లో తనిఖీ చేసి లెక్క తీస్తా.
- నాగలత, ఇన్‌చార్జి డీపీవో

డిసెంబరు 9 వరకు ఎమ్మెల్సీ ఓటు గడువు
తెలుగు భాషపై అభిమానం ఉండాలి 7



చంద్రబాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

సీఎం చంద్రబాబుతో దళిత ఎమ్మెల్యేల సమావేశం

రాజమహేంద్రవరం,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని టీడీపీ , జనసేన వర్గాలకు చెందిన ఎస్సీ సామాజికవర్గ ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు గురువారం రాత్రి రాజధానిలో సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఎలా అమలు చేయాలనే విషయంతో పాటు ఎస్సీ పారిశ్రామిక విధానం తదితర అంశాలపై చర్చించినట్టు సమా చారం.సమావేశానికి జిల్లా నుంచి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు,కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు.



అగరబత్తీల తయారీ శిక్షణ పరిశీలిస్తున్న కలెక్టర్

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : కలెక్టర్

కడియం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధి రుణాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. కడియంలో వ్యర్థపూలతో అగరబత్తీల తయారీ యూనిట్‌లో శిక్షణ పొందిన మహిళలతో గురువారం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. అక్టోబరు 20వ తేదీన పర్యావరణ పరిరక్షణ, వ్యర్థ పూల నుంచి ఆదాయ వనరులుగా ఏర్పాటు చేసిన అగరబత్తీల తయారీ యూనిట్‌ను సందర్శించడం జరిగిందన్నారు. 52 మంది శిక్షణ పొందగా తొలియూనిట్ స్థాపనకు 12 మంది ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి,తహశీల్దార్ పోశియ్య, ఎంపీడీవో రమేష్, స్మాల్‌స్కేల్ డెవలప్‌మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేన్సర్ అవగాహనకు స్ర్కీనింగ్ ముఖ్యం

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ నివారణలో స్ర్కీనింగ్ ముఖ్యం అని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం జరుగుతున్నదన్నారు. ప్రస్తుతం కేన్సర్లలో రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్, నోటి క్యాన్సర్ వంటివి సుమారుగా 34 శాతం వరకూ ఉన్నాయనే అంచనా ఉందన్నారు.ఈ నెల 14న ప్రభుత్వం లాంఛనంగా నిర్వహించే గృహ సందర్శనలో ప్రజలు భాగస్వాములవ్వాలన్నారు. వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.



బాగా.. పెంచినారు!

జిల్లాలో పెరిగిన పొగాకు నారుమడులు

పొగాకు నారుకు డిమాండ్
గతేడాది ధరలే కారణం
గతేడాది మూట రూ.3 వేలు
ఈ ఏడాది మూట రూ.5 వేలు
పెరిగిన పొగాకు సాగు విస్తీర్ణం

రాజానగరం,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పొగాకు పంటకు కలిసొచ్చింది.. రికార్డు స్థాయిలో ధర పలికింది.. రైతాంగం కేజీ పొగాకు రూ. 200 దాటితే చాలని అనుకు నేవారు.. అటువంటిది ఏకంగా రూ.400లు దాటి పలకడంతో బంగారంగా మారిపోయింది. దీంతో పొగాకుకు ఎక్కడలేని డిమాండ్ వచ్చిపడింది. ఒకనాడు సాగు చేయడానికే నిరాశ కనబరిచే స్థాయి నుంచి అదే సాగు చేయాలనే పట్టుదలకు వచ్చారు. ఎందుకంటే గతేడాది ధర రైతులపై అంత ప్రభావం చూపింది.దీంతో ఎన్నడూ లేనిది పొగాకు సాగు విపరీతంగా పెరిగిపోయింది. అధికారులు వద్దన్నా వినలేదు..కాదన్నా వినలేదు. అధికారిక సమాచారం ప్రకారం వేలాది ఎకరాల్లో సాగు పెరిగినట్టు ఒక అంచనా.దీంతో పొగాకు నారుకు డిమాండ్ ఏర్పడింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో వరుస నష్టాల బాట పట్టిన పొగాకు నారు సాగు రైతుల్లో ఈ ఏడాది ఆశలు చిగురించాయి.గత రెండు,మూడేళ్లుగా పొగాకు ధర లేకపోవడంతో సాగు అంతంత మాత్రంగా ఉండేది.దీంతో నారు సాగు రైతులు కోలుకోలేని నష్టాలను చవిచూశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతాంగాన్ని పొగా కు నారుమడులు నట్టేటముంచాయి.ఈ ఏడాది వరుస తుఫాన్లు,అధిక వర్షాలు..రికార్డు స్థాయి ధర కారణంగా నారుమడులకు గిరాకీ ఏర్పడింది. గతేడాది 4 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేయగా ఈ ఏడాది 4,800 హెక్టార్లకు పెరిగి నట్టు సమాచారం. దీంతో నారుకు అమాంతం డిమాండ్ పెరిగింది.ఇతర దేశాల్లో సాగు విస్తీర్ణం తగ్గడంతో మన జిల్లాలో డిమాండ్ ఏర్పడింది. గతేడాది అవసరం మేరకు సాగు చేశారు. ఈ ఏడాది సాగు పెరగడంతో ధరపై ప్రభావం చూపుతుందని అధికారులు అంటున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం..

జిల్లాలోని మెట్ట ప్రాంతమైన రాజానగరం మండలం కలవచర్ల, దివాన్‌చెరువు, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలైన తొర్రేడు, మిర్తిపాడు, కొవ్వూరు, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లోని దొమ్మేరు,ధర్మవరం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా పొగాకు నారుమడులు కడుతున్నారు.ఇక్కడ సాగుచేసే పొగనారుకు డిమాండ్ ఎక్కువ. ఎందుకంటే నాణ్యతగా ఉం టుందని రైతులకు నమ్మకం. గతేడాది వరకూ నారుమడులు తక్కువ సంఖ్యలో కనిపించేవి.నారుమడులు కట్టినా సాగు తక్కువగా ఉండేది.ఈ ఏడాది మాత్రం నారుకు ఎగబడుతున్నారు. ఈ నేపథ్యం లో నారుమడులు పెరిగాయి. గతే డాది రూ.3 వేలు నుంచి రూ.3,500 వరకు ధర పలికింది.ఈ ఏడాది ప్రస్తుతం రూ.4 వేలు నుం చి రూ.5 వేల ధరకు చేరుకుంది. ఎగువ ప్రాం తం నుంచి రైతులు ఇక్కడకు వచ్చి నారు కొను గోలు చేసేందుకు ఎగబడుతున్నారు.ఈ ఏడాది అను కూల వాతావరణంతో తమకు లాభాలు తెచ్చిపెడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ పరిస్థితులు అనుకూలం



ఈ ఏడాది పొగాకు నారు మడుల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. గత రెండు, మూడేళ్లుగా ఆశించిన లాభాలు రాకపోగా తీవ్రంగా నష్టపోయాం. ఈ ఏడాది రైతులు ఆశించినట్టుగానే సాగుతోంది. నారుమడులు చీడ పీడలు కూడా దరిచేరలేదు.
- పిల్లా రామకృష్ణ, కౌలు రైతు, కలవచర్ల

నారు ధర బాగుంది..



గతేడాది మూట (6 వేలు మొక్కలు) రూ.2 వేలు నుంచి రూ.3 వేలు ఉండేది. ప్రస్తుతం మూట రూ.5 వేలు వరకు ధర పలు కుతోంది. ఎకరం విస్తీర్ణంలో నారుమడులు కట్టాలంటే రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఖర్చవుతుంది.నష్టాలు గట్టెక్కింటేలా ఉన్నాయి.
- ఆదం సత్యనారాయణ, రైతు కలవచర్ల

మూడేళ్లుగా వరుస నష్టాలే..



నారుమడుల సాగుతో గత రెండు, మూడేళ్లుగా వరుస నష్టాలు బారిన పడ్డాం. ఈ ఏడాది బాగానే ఉంది. కలవచర్లలో ప్రస్తుతం సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో నారు సాగు చేస్తున్నారు. విత్తనాలు చల్లిన నాటి నుంచి నారు తీతకు రావడానికి 45 రోజులు పడుతుంది.
- సబ్బు బాపిరాజు, కౌలు రైతు కలవచర్ల



చక్రద్వారబంధంలో కొనుగోలు చేసిన నీటిని పట్టుకుంటున్న ఇంటి యజమాని

నీళ్లు కావాలంటే.. పని మానుకోవాల్సిందే!

చక్రద్వారబంధంలో తాగునీటి ఇక్కట్లు

రాజానగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చెంతనే గోదావరి..అయినా తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు..తాగునీరు కావాలంటే అప్రమత్తంగా ఉండాల్సిందే.ఎందుకంటే రోజులో ఎప్పుడొస్తుందో ఏమో తెలియదు.. ఒక వేళ వస్తే వెంటనే పట్టుకోవాలి.. తరువాత మళ్లీ నీరెప్పుడొస్తుందో తెలియదు..గ్రామంలో మరికొన్ని ఏరియాల్లో అయితే పనులు మానుకుని నీటి కోసం కాపలాకాసేవారు కొందరైతే, ట్రాక్టర్ల ట్యాంకర్ల ద్వారా రూ.800లకు నీటిని కొనుగోలు చేసుకుంటున్న వారు మరికొందరు. ఇలా ఎవరు స్థాయిలో వారు తాగునీటి వెతలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇదెక్కడో మారుమూల అనుకుంటే పొరబడినట్టే.. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదన ఉన్న రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో దుస్థితి ఇది.. చెంతనే గోదావరి ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో తాగునీటిని కొనుగోలు చేసుకుని దాచుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. చక్రద్వారబంధం గ్రామంలో మూడు బోర్లు ఉన్నప్పటికి గ్రామంలో అన్ని ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరందడం లేదు.ఈ నేపథ్యంలో తాగునీటితో పాటు వాడకం నీటిని కూడా కొనుగోలు చేసుకుంటున్నారు. పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు నలిగిపోతున్నారు. పంచాయతీలో నిధులు పుష్కలంగా ఉన్నప్పటికి అభివృద్ధి మాత్రం వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో విలీన ఉత్తర్వులతో గ్రామా భివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. వెంకటనగరం పంపింగ్ స్కీమ్ ద్వారా గోదావరి జలాలకు పైపు లైను ఉన్నా నీరందని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి, గ్రామంలో నెలకొంటున్న తాగునీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు వేడుకుంటున్నారు.



కొవ్వూరువాసుల పెద్ద మనసు

కొవ్వూరు నియోజకవర్గ ప్రజల నుంచి విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ. 90,54,999ల చెక్కును గురువారం రాజధానిలో సీఎం నారా చంద్రబాబు నాయుడికి అందజేస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి తదితరులు. - కొవ్వూరు



'కాడెడ్ల బండి' ఇక.. 'షో'బొమ్మ!





పెళ్లిళ్లు, తీర్థాలకు వెళ్లాలంటే ఎడ్లబండ్లపైనే ప్రయాణం

పరుగులు తీయాలి.. గిత్తలు ఉరకలు వేయాలి.. వాగులు దాటి మన ఊరు చేరాలి.. అంటూ సాగుతుంది అలనాటి ఓ సినిమా పాట. పల్లె ప్రయాణ సాధనాలైన జోడెడ్లు, వంటెద్దు బండ్లకు ఉండే ప్రాముఖ్యతను అలనాటి సినీ గీతాలు వెల్లడిచేస్తాయి. బస్తీలో ఆడే సినిమాలకు వెళ్లాలన్నా, సమీప గ్రామాల్లో జరిగే జాతర్లకు, తీర్థాలకు వెళ్లాలన్నా ఆరోజుల్లో బండ్లు కట్టుకునే వెళ్లేవారు. బండెనక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి అంటూ నేటికీ ఉర్రూతలు ఊగిస్తున్న ఈ పాటలోని పదహారు బండ్ల మాటేమోగాని నేడు పల్లెల్లో ఒక్క ఎడ్లబండీ కానరావడం లేదు. పల్లె పేరు తలుచుకుంటే గుర్తుకు వచ్చే ఎడ్లబండ్లు కనుమరుగైపోతున్నాయి. ధాన్యం, సరుకుల రవాణాలో కీలకమైన ఎడ్ల బండ్లు ఇవాళ టెక్నాలజీ పేరుతో వచ్చిన యంత్రాల తాకిడికి కనుమరుగైపోయాయి. నాడు వైభవాన్ని చాటిన కాడెడ్లు నేడు ఇళ్ల ముందు అలంకారంగా, ఇళ్లలో టేబుళ్లుగా, షో బొమ్మల్లాగా దర్శనమిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి- రావులపాలెం)

ఒకప్పుడు పల్లెల్లో ఎడ్లబండ్లు అంతర్భాగంగా ఉండేది. ఇంచుమించుగా రెండెకరాలు పొలం ఉన్న ప్రతి రైతు ఇంట ఒక ఎండ్ల బండి ఉండేది. కానీ నేటి యాంత్రిక యుగంలో ఎడ్ల బండ్లు ఉనికిని కోల్పోయాయి. పల్లెల్లో ప్రయాణసాధనంగా ఉండే ఎడ్లబండ్లు వ్యవసాయ పనిముట్లు చేరవేయడం మొదలుకొని పండిన పంటను ఇంటికి చేరవేసే వరకు కీలకపాత్ర పోషించేవి. పెళ్లిళ్లు, పేరంటాలు, సినిమాలు, షికార్లు, తీర్థాలు, నాటకాలు, వనభోజనాలతోపాటు ఆఖరికి పొలాలకు కూలీలను తరలించడానికి సైతం ఎడ్లబండ్లను వినియోగించేవారు. బండెనకబండి పదుల సంఖ్యలో వరుసుగా వెళ్తుంటే చూడటానికి రెండు కళ్లు సరిపోయేవికావు. ఎడ్లబండిపై ఊరు ఊరంతా తరలివెళ్లిన సంఘటనలు తీపిగుర్తులుగా మిగిలిపోయాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రహదారులు ఉండేవికావు. పుంతరోడ్లు, మట్టిరోడ్లు ఉండేవి. రహదారి సౌకర్యాలు లేని ఆ రోజుల్లో ఎక్కడికి వెళ్లాలన్నా ఎడ్లబండ్లనే వాడేవారు. మైళ్ల దూరం వెళ్లాల్సి వచ్చినప్పుడు పదుల సంఖ్యలో బండ్లలో వెళ్లేవారు. దీంతో దూరం నుంచి చూస్తే రైలు పెట్టెలా కనువిందు చేసేది. ఎడ్లబండ్లో కూర్చున్నవారు వర్షానికి తడవకుండా ఎండతగలకుండా గూడు కట్టేవారు. బండికి ముందుభాగంలో తొట్టె ఉండేది.. అందులో ఎండుగడ్డి, పచ్చిగడ్డి, దాణాలను ఎడ్ల మేత కోసం ఉంచేవారు. కొత్తగా పెళ్లైన్న కూతురిని అత్తవారు ఇంటికి పంపాలన్నా, పుట్టింటికి తీసుకురావాలన్నా ఎడ్లబండినే ఉపయోగించేవారు. ఆఖరికి గ్రామాల్లో ఎవ్వరికైనా జబ్బు చేస్తే ఎడ్లబండే ఎమర్జెన్సీ అంబులెన్స్ సర్వీస్.

సవారీ బండి... బెంజ్‌తో సమానం..

అప్పట్లో ధనవంతులు జమీందార్లు వాడిన సవారీ ఎడ్లబండి నేటి బెంజ్‌కారుతో సమానమని వృద్ధులు చెబుతున్నారు. సవారీ బండి సవారీ ఎడ్లతో గజ్జలమోతతో వేగంగా దూసుకెళ్లేది. అప్పట్లో వాహనాల శబ్దాలు లేకపోవడంతో గజ్జలమోత కిలోమీటర్ల మేర వినిపించేది. సవారీబండి టేకు కలపతో సుందరంగా తయారు చేయించేవారు. పలు డిజైన్లలో ఆకట్టుకునే విధంగా ఈ బండి అందంగా ఉండేది. పైన అందమైన గూడు, లోపల మెత్తటి పరుపు కూడా ఉండేది. అప్పట్లో ఈ సవారీ బండ్లపై పెళ్లికొడుకు, పెళ్లికూతురు వస్తే వారు ధనవంతులుగా భావించేవారు. అంటే సవారీబండి ఓ విలాసం.

ఎడ్లను బట్టి స్పీడ్.....

బండ్ల వేగం దానికి కట్టిన ఎడ్లను బట్టి ఉండేది. ప్రధానంగా ఒంగోలు, దేశవాళి, మైసూర్ ఎడ్లను కట్టేవారు. వీటిలో ఒంగోలు, దేశవాళి ఎడ్లు ధృడంగా ఉండి ఎంత బరువునైనా అలవోకగా మోసేవి. మైసూర్‌ఎడ్లు వేగంగా పరిగెత్తేవి. వీటికి మంచి డిమాండ్ ఉండేది. ప్రస్తుతం కొత్త కొత్తమోడల్ బైకుల గురించి ఎలా మాట్లాడుకుంటున్నామో ఆ రోజుల్లో ఎద్దు, ఎడ్ల బండ్ల గురించి వాటి విశేషాలు ఆసక్తిగా చర్చించుకునేవారు. సంక్రాంతి పండుగ ఎడ్లపందాలకు మంచి క్రేజ్ ఉండేది. ఇప్పటికీ అక్కడక్కడ ఎడ్ల పందాలు పోటీలు జరుగుతూనే ఉన్నాయి.

సాగులోనూ కీలకమే...

సాగు ప్రారంభించిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చేవరకు రైతునేస్తంగా ఎడ్లబండ్లు ప్రముఖ పాత్రపోషించేవి. వరినాట్లు మొదలు ఎరువులు, కూలీలను తీసుకెళ్లడం, పంటను ఇంటికి చేర్చడం వరకు కీలకపాత్ర పోషించేవి. కాలక్రమేణ అవి కనుమరుగైపోయాయి. యంత్రాలు, ఆధునిక పనిముట్లు రావడం, కష్టం తక్కువగా ఉండడం, పని తొందరగా అయిపోవడంతో రైతులు కూడా యాంత్రీకరణ వైపు మొగ్గుచూపారు. దీంతో ఎడ్లబండ్ల తయారీదారులు ఉపాధి కరువై వేరే వేరే వృత్తుల వైపు వెళ్లిపోయారు. ఎడ్ల బండి చేయాలంటే ఇప్పుడు చాలా కష్టసాధ్యం. చేసేవాళ్లు సైతం అరుదనే చెప్పాలి.







ఒంటెద్దు బండ్లు..

వ్యవసాయ పనులకు రెండెడ్ల బండ్లు కీలకమైతే ఆరోజుల్లో గోదావరి జిల్లాలో ప్రజల రవాణాకు గుర్రపు బండ్లు ఉపయోగపడేవి. వీటి కోసం గ్రామాలు, పట్టణాల కూడళ్లలో స్టాండ్లు కూడా ఉండేవి. ఇక నిత్యావసరాలు మొదలుకొని సరుకు రవాణాలో ఒంటెద్దు బండ్లు కీలకంగా ఉండేవి. ఒకే ఎద్దుతో ఈ బండ్లను లాగించేవారు. ఏదైనా కిరాణా దుకాణాలకుగాని, సంతలకుగాని సరుకు వెళ్లాలంటే ఒంటెద్దు బండ్లే ప్రధాన ఆధారంగా ఉండేవి.

షో... బొమ్మల్లా మారి..

కాడెడ్ల బండ్లు కనుమరుగవ్వడంతో వాటి జ్ఞాపకాల కోసం బజార్‌లో దొరికే కలపతో తయారుచేసిన ఎడ్లబండి బొమ్మలను ఇంట్లో పెట్టుకుంటున్నారు. చిన్న, పెద్ద సైజుల్లో ఎద్దులు, బండి అచ్చుగుద్దినట్టు ఎడ్లబండిలానే తయారుచేసిన బొమ్మలకు క్రేజ్ పెరిగింది. ఇలా కొందరు షోకేసుల్లో బొమ్మల్లా పెట్టి ఆనందిస్తుండగా, మరికొందరు టేబుళ్లగా చేయించుకుని వాడుతున్నారు. కాడెడ్ల బండ్లను ధరలు రూ.6,500 నుంచి రూ.25 వేల వరకు వాటి నాణ్యత, సైజు, మోడల్ బట్టి విక్రయిస్తున్నారు. అలాగే ఇళ్లలో వాడే సెంటర్ టేబుళ్ల రూపంలో తయారుచేసిన బండ్లను రూ.25 నుంచి రూ.50 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదిగాకుండా పూర్వం ఎడ్లబండ్లగా వాడిన పాత బండ్లను రంగువేసి అందంగా అలంకరించి ఇళ్ల ముందు కొందరు పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా నగరాల్లో ఈ కల్చర్ బాగా పెరిగింది.



జగ్గన్నతోట ప్రభల తీర్థానికి గత ఏడాది ఎడ్ల బండ్లపై వస్తున్న జనం


పదండి పోదాం... ప్రభల తీర్థానికి..

450 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన జగ్గన్నతోట ప్రభల తీర్థం చూసేందుకు అప్పట్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నలుమూలల నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా వంట సామగ్రితో ఎడ్లబండిపై వచ్చేవారు. ఈ జగ్గన్నతోట ప్రభల తీర్థంలో తిరిగి అక్కడే వండుకుని తిని తిరిగివెళ్లేవారట. అయితే ఈ సంప్రదాయం కొనసాగుతున్నా ఎడ్లబండ్లు మాత్రం తగ్గాయి. అయినప్పటికీ ఇప్పటికీ కొందరు ఎడ్ల బండ్లపైనే తీర్థానికి వస్తుండడం విశేషం. కొబ్బరాకులతో వేసిన గూడు బండ్లలో రావడం కన్నులపండువగా ఉంటోంది.





కలర్ డాప్లర్ పరీక్ష..



అడ్వాన్స్‌డ్ డిజిటల్ ఎక్స్‌రే యంత్రం

వ్యాధి నిర్ధారణలో కీలకంగా..

నేడు వరల్డ్ రేడియాలజీ డే

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యాధి నిర్ధారణలో కచ్చితత్వాన్ని తెలియజేసే విషయంలో రేడియాలజీ విభాగం పాత్ర కీలకం. 1895, నవంబరు 8న జర్మనీకి చెందిన విల్‌హెమ్ కాన్‌రాడ్ రాన్‌జెన్ అనే శాస్త్రవేత్త ఎక్స్‌రేను కనుగొన్నాడు. తద్వారా వ్యాధి నిర్ధారణకు అనేక పరికరాలు వచ్చాయి. అందువల్ల ప్రతిఏటా నవంబరు 8న ప్రపంచ రేడియాలజీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉభయగోదావరి జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న కాకినాడ జీజీహెచ్‌లో రేడియాలజీ విభాగం అతి ముఖ్యమైనది రోగులు లేదా క్షతగాత్రులు లేదా గర్భిణులు ప్రతిరోజూ 3500 మంది నుంచి 4 వేలమంది వరకు వస్తూ ఉంటారు. వారిని మొదట వైద్యుడు పరీక్షించి రోగ నిర్ధారణ కోసం పలు ఎక్స్‌రే పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తూ ఉంటారు. ఆ పరీక్షల నివేదిక ఆధారంగా వారికి వైద్యుడు ఇన్‌పేషెంట్‌గా గానీ, అవుట్‌పేషెంట్‌గాగానీ కచ్చితమైన చికిత్స అందించేందుకు వీలు కలుగుతుంది. అందువల్ల జీజీహెచ్‌లో రేడియాలజీ విభాగ సేవలు కీలకంగా మారాయి. జీజీహెచ్‌లో ఐదు ఎక్స్‌రే ప్లాంట్‌లు, 12 మొబైల్ ఎక్స్‌రే ప్లాంట్‌లు, 5 అల్ట్రాసౌండ్ పరికరాలు, 2 కలర్‌డాప్లర్ పరికరాలు, ఒక సిటీ స్కాన్ యంత్రం, ఒక ఎంఆర్‌ఐ స్కాన్ యంత్రం అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాల ద్వారా ప్రతిరోజూ 800 మందికి రోగనిర్ధారణ చేయగలుగుతున్నారు. ఎంఆర్‌ఐ స్కాన్‌లో బ్రెయిన్, స్పైన్‌లో అసాధారణమైన నిర్ధారణను కచ్చితత్వంగా తెలియజేస్తుంది.



సాధారణ ఎక్స్‌రే

అన్ని పరీక్షలు అందుబాటులో..

కాకినాడ జీజీహెచ్‌లో అన్ని రకాల ఎక్స్‌రే పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ప్రపంచ రేడియాలజీ దినంలో భాగంగా ఈ ఏడాది 'కనిపించని దాన్ని చూడగలగడం' అనే నినాదంతో ఈ డేను నిర్వహించదలిచాం. రేడియాలజీ విభాగానికి చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. మానవ అవయవాల్లో ఎంత చిన్న డిసీజ్ ఉన్నా పసిగట్టగలిగేవి రేడియాలజీ సేవలే. ముఖ్యంగా సున్నితమైన గర్భిణికి ఎటువంటి ఎక్స్‌రే కిరణాలు ఎఫెక్ట్ అవ్వకుండా అల్ట్రా సౌండ్ పరికరంతో పరీక్ష చేసి కచ్చితమైన నిర్ధారణ చేయవచ్చు. మెరుగైన సేవలందించేందుకు మరిన్ని అడ్వాన్స్‌డ్ అల్ట్రా సౌండ్ పరికరాలు అవసరం. ఇప్పటికే ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారి ద్వారా కలెక్టర్‌కు పరికరాల అవసరత గురించి విన్నవించాం. జీజీహెచ్‌లో ఎక్స్‌రే మిషన్‌లు, ఫ్లోరోస్కోప్ మిషన్లు, సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ యంత్రం తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. పేదలు రేడియాలజీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. **- డాక్టర్ అనురాధ, రేడియాలజీ హెచ్‌వోడీ, జీజీహెచ్**





46 సంవత్సరాల క్రితం తాము చదువుకున్న తరగతి గదిలో అప్పటి విద్యార్థినులుగా పూర్వ విద్యార్థినులు

60 ఏళ్లొచ్చినా.. అదే అల్లరి!

● అనపర్తిలో పూర్వ విద్యార్థినుల సమ్మేళనం

అనపర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దలు పిల్లలైపోయారు..ఆనందంతో గంతులేశారు.. ఆడారు.. పాడారు.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు.. ఇదేదో 30..40 ఏళ్ల పూర్వ విద్యార్థినులు కాదండోయ్.. సుమారుగా 60 ఏళ్లవాళ్లంతా కలుసుకున్నారు. తమ తరగతిలో కూర్చుని ఆ నాటి తీపిజ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.. ఈ మధుర జ్ఞాపకాలకు అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాల గురువారం వేదికగా మారింది. 1977-78లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థినులు పాఠశాలలో గురువారం కలుసుకున్నారు. ఏమేవ్ ఏంచేస్తున్నాం.. గుర్తున్నాయా ఆ రోజులు.. నువ్వు ఢిల్లీ వెళ్లి కప్ తెచ్చావా మరచిపోయావా.. ఇదిగో నీ కప్పు అంటూ ఆనాటి 46ఏళ్ల తరువాత ఆ కప్ అందించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కాసేపు తమ తరగతి గదిలో కూర్చుని ఆనాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుని.. ఒకరికొకరు ఫొటోలు తీసుకుని మళ్లీ కలుద్దాం.. సెలవంటూ భారంగా సాయంత్రం ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. పాఠశాలకు ఆర్థికసాయం అందజేస్తామని చెప్పారు. కొవ్వూరి సరస్వతి కృషితో జరిగిన ఈ సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు సుబ్బలక్ష్మి, సత్యవతి నిర్మల, సుజాత, జయశ్రీ హాజరయ్యారు.



తమ స్నేహితులను సెల్‌ఫోన్‌లో చిత్రిస్తూ స్నేహితురాలు బిజీ బిజీ



చదువుకునే రోజుల్లో గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి వెళ్లి క్రీడా పోటీల్లో పాల్గొన్న స్నేహితురాళ్ల సంతోషాలు

11 నుంచి స్వామివారి కల్యాణోత్సవాలు

● కల్యాణ సంతాన గోపాలుడిగా ప్రసిద్ధి

పిఠాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ఈనెల 11వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. కల్యాణ, సంతాన గోపాలుడిగా ప్రసిద్ధిగాంచిన ఈ స్వామి ఉత్సవాలు 18వ తేది వరకూ జరుగుతాయి. 11వ తేదిన ఉదయం విశ్వక్సేన పూజ, స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన నిర్వహిస్తారు. 12వ తేదిన స్వామి, అమ్మవార్లకు అర్చనలు, వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి సేవా సమితి మహిళా భక్త సమాజంచే కల్యాణ అలంకారం, గజవాహనంపై గ్రామోత్సవం, సాయంత్రం 6గంటలకు ధ్వజారోహణం, రాత్రి స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతాయి. 13వ తేదిన స్వామి, అమ్మవార్లకు అర్చనలు, శేషవాహనంపై గ్రామోత్సవం, 14వ తేది సాయంత్రం సదస్యం, పండిత సభ, రాత్రి స్వామి రథోత్సవం, 15వ తేదిన ఆలయం వద్ద చక్రస్నానం, గరుడ వాహనంపై గ్రామోత్సవం, 16వ తేదిన స్వామికి శ్రీపుష్పయాగం, 17,18వ తేదిల్లో 2,3వ రోజు పుష్పయాగాలు నిర్వహిస్తారు. యాగ్నిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈవో నున్న శ్రీరాములు, అర్చకుడు పి.విజయజనార్థనాచార్యులు, ఆలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్‌లు కోరారు. కల్యాణోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు.





పిఠాపురంలోని వేణుగోపాలస్వామి దేవస్థానం, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి



అయోధ్యనగర సీతారామ ఫౌండేషన్ ట్రస్టుకు అందజేసిన సీతారామలక్ష్మణుల పంచలోహ విగ్రహాలు

టీటీడీ సభ్యుడిగా

మునికోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితుడైన అక్కిన ముని కోటేశ్వరరావు గురువారం తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్, కొంతమంది సభ్యులు బుధవారమే ప్రమాణ స్వీకారం చేయగా, గురువారం కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన కుటుంబ సభ్యులతో కలసి హాజరయ్యారు. తాను ఊహించని విధంగా తనకు స్వామికి సేవ చేసే అవకాశం వచ్చిందని, మంచిగా సేవ చేస్తానని ఆయన తెలిపారు.



మునికోటేశ్వరరావును అభినందిస్తున్న దృశ్యం

భీమేశ్వరస్వామికి విశేష పూజలు

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలు ఆరవవరోజు పురస్కరించుకుని సామర్లకోట కుమారరామభీమేశ్వరాలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా గోపూజలు నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న, వినయ్ వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని, స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం మారేడుదళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ధ్వజస్థంభంవద్ద ఆకాశదీప పూజలలోనూ, కార్తీక దీపారాధన సంఘ సభ్యులుచే నిర్వహించి న జ్యోతిర్లింగార్చన పూజలలో భక్తులు పాల్గొన్నారు.



జ్యోతిర్లింగార్చన దృశ్యం

అయోధ్య రాములోరికి

పంచలోహ విగ్రహాలు

● అందజేసిన మండపేటవాసి శ్రీనివాసరావు

మండపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం మారేడుబాకకు చెందిన వాసా శ్రీనివాసరావు దేవాలయ విగ్రహాలు తయారుచేసే శిల్పి అయోధ్య బాలరాముడు 25 కిలోల పంచలోహ విగ్రహంను గురువారం అయోధ్యకు పంపించారు. 16అంగుళాల ఎత్తు 20కిలోల పంచలోహలతో విగ్రహంను తయారుచేశారు. అయోధ్య నగర సీతారామా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాసశాస్త్రి అయోధ్యరాముడికి బాలరాముడిని పంపించామని శ్రీనివాసరావు తెలిపారు. అలాగే అయోధ్యలో చల్లా శ్రీనివాసశాస్త్రి గత ఆరేళ్లనుంచి నిర్వహిస్తున్న ట్రస్టుకు సంబంధించి అయోధ్య రాముడు సూర్యవంశంకు చెందిన ఆలయంను నిర్మిస్తున్నారు. వాసా శ్రీనివాసరావు దంపతులు శ్రీసీతారామచంద్ర లక్షణ, హనుమాన్, 90 కిలోలతో తయారుచేసిన పంచలోహ విగ్రహాలు అందజేశారు. అయోధ్యకు ఉత్సవ మూర్తుల విగ్రహల అందజేసిన కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు వి.సాయికుమార్‌బాబు, వేగుళ్ల అజయ్‌బాబు విగ్రహాలను ట్రస్టీకి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందరాజు, ఎంపీఎస్ చిన్నారావు, వాసారవికిరణ్, శిరంగు ఈశ్వరరావు, బండి గోవిందు పాల్గొన్నారు.



బాలరాముడు విగ్రహాన్ని ట్రస్టుసభ్యులకు అందజేస్తున్న అజయ్‌బాబు



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి
రూ.2 లక్షలు విరాళం

ఆత్రేయపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనానికి గూడపాటి రాంబాబు-నవ్య, గూడపాటి త్రివేది-దుర్గారాణి దంపతులు గురువారం రూ.2 లక్షలు విరాళం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5,09,207 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప కులపతి శ్రీనివాసరావు

రేపు 'నన్నయ'లో జాతీయ శతాధిక కవి సమ్మేళనం

దివాన్‌చెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో శనివారం జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య వైశ్రీనివాసరావు తెలిపారు. గురువారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నన్నయ వర్శిటీ తెలుగు శాఖ, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మేళనానికి ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఒడిశాల నుంచి 150 మంది కవులు హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కన్వీనర్ తరపట్ల సత్యనారాయణ, అధ్యాపకులు తలారి వాసు, పి.వెంకటేశ్వరరావు, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకుడు పీవీబీ సంజీవరావు పాల్గొన్నారు.





ప్రయాణికుడి వద్ద దొరికిన బుల్లెట్లు, బ్యాగ్

మధురపూడి విమానాశ్రయంలో
కలకలం

అరు బుల్లెట్లతో ప్రయాణికుడు అరెస్టు

కేసు నమోదు

కొనసాగుతున్న దర్యాప్తు

కోరుకొండ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మధురుపూడి విమానాశ్రయంలో బుధవారం రాత్రి ప్రయాణికుడి వద్ద దొరికిన బుల్లెట్లు తీవ్ర కలకలం రేపాయి. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం మధురుపూడి విమానాశ్రయానికి బుధవారం రాత్రి విజయవాడకు చెందిన ఎం.సుబ్బరాజు హైదరాబాద్ వెళ్లేందుకు వచ్చాడు. ఆయన తన లగేజ్‌తో టెర్మినల్ భవనంలోకి వెళ్లే సమయంలో ఆయన వద్ద బుల్లెట్లు ఉన్నట్టు స్కానింగ్‌లో వెల్లడైంది. వెంటనే అప్రమత్తమైన ఎస్‌పీఎఫ్ సిబ్బంది ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. బుల్లెట్లు స్వాధీనం చేసుకుని బుధవారం అర్ధరాత్రి కోరుకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే తనకు లైసెన్స్ గన్ ఉందని, తుపాకీ లోడ్ చేస్తున్న సమయంలో కొన్ని బుల్లెట్లు తన వద్ద ఉండిపోయాయని వాటిని చిన్న బ్యాగ్‌లో ఉంచి మర్చిపోయానని సుబ్బరాజు పోలీసులకు తెలిపాడు. బుల్లెట్లను, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయ నిబంధనల ప్రకారం బుల్లెట్లతో ప్రయాణించడం, దానికి తగిన అనుమతులు తీసుకోకపోవడంతో ఆయనపై గురువారం ఉదయం కేసు నమోదు చేసినట్టు కోరుకొండ ఎస్ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు. బుల్లెట్లు స్వాధీనం చేసుకుని సుబ్బరాజుకు స్టేషన్ బెయిల్ ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దర్యాప్తులోని అంశాలను అనుసరించి తదుపరి చర్యలు ఉంటాయన్నారు.





విద్యార్థినుల నృత్య ప్రదర్శన

జ్యోతిప్రకాశనంతో సదస్సును ప్రారంభిస్తున్న శాంతిశ్రీ ధూళిపూడి పండిట్, ఆచార్య శ్రీనివాసరావు, డాక్టర్ రామారెడ్డి

తెలుగు వైభవాన్ని ప్రపంచ దేశాలకు తెలియజేయాలి

ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్

దివాన్‌చెరువు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు వైభవాన్ని భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలకు తెలియజేయాలని న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, కళాశాల ఆంగ్ల విభాగం, విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సాంస్కృతిక సమితి, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో రెండు రోజుల పాటు జరిగే సాంస్కృతిక వైభవం-సదస్సును గురువారం అతిథులు జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ మాట్లాడుతూ దేశంలో భాషాభిమానం ఎక్కువగా ఉన్న వారిలో తమిళనాడు మొదటి స్థానంలో ఉందన్నారు. తెలుగు వారు అటువంటి భాషాభిమానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. నిద్రాణమైన జాతిని జాగృతం చేయడం కోసం గత వైభవస్మరణం ఎంతో అవసరమన్నారు. కందుకూరి, గురజాడ వంటి మహనీయులు మన సంస్కృతిలో భాగమన్నారు. అటువంటిమహనీయులను స్మరించుకుంటూ భావితరాలకు మన సంస్కృతిని అందించాలని సూచించారు. భాష, సంస్కృతి, కథన శక్తిని అందరూ పెంపొందించుకోవాలని కోరారు. నన్నయ ఉప కులపతి ఆచార్య వైశ్రీనివాసరావు మాట్లాడుతూ మన ప్రాంతంలో ఉన్న సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడానికి ఈ సదస్సు చక్కని వేదిక అవుతుందన్నారు. 'జ్ఞానమంటే డిగ్రీ కాదోయ్... జ్ఞానమంటే ప్రపంచానికి ఉపయోగపడే యువశక్తిని తెలియజేయడమే' అన్న గురజాడ మాటలను ఆయన గుర్తు చేశారు. కాప్స్ అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో ఉపాధి అవకాశాల నేపథ్యంలో సామాజిక అంశాలను విస్మరిస్తున్నారన్నారు. సదస్సులో నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి, కాప్స్ ఉపాధ్యక్షుడు ఆచార్య జి.నాగేశ్వరరావు, అటవీ శాఖ విశ్రాంత అధికారి నళినీమోహన్, సదస్సు కన్వీనర్లు ఆచార్య కె.రమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి మాట్లాడారు. మధ్యాహ్నం జరిగిన సదస్సులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు పరిశోధనా పత్రాలను సమర్పించారు. అనంతరం కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీనటరాజ నిలయ చర్మచిత్ర కళాకారుల తోలు బొమ్మలాట ఆకట్టుకున్నాయి.



క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న కాకినాడ జిల్లా డీఈవో రమేష్

ఉత్సాహంగా జిమ్నాస్టిక్స్ పోటీలు

కాకినాడ అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు క్రీడల్లో రాణించే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని కాకినాడ జిల్లా విద్యా శాఖాధికారి పి.రమేష్ అన్నారు. కాకినాడలోని జిల్లా క్రీడా మండలి మైదానంలో అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీలను గురువారం ఆయన జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. 68వ ఎస్‌జీఎఫ్ అంతర్ జిల్లా జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా అండర్-14, 17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వందలాది మంది క్రీడాకారులు హాజరయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, వ్యాయామ విద్యా రాష్ట్ర పర్యవేక్షణాధికారి భానుమూర్తి రాజు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విఠల్, ఏడీ నాగేశ్వరరావు, తలాటం హరీష్, పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి నూకరాజు, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ షర్మిల పాల్గొన్నారు.



క్రీడాకారుల విన్యాసాలు



జీఎస్ఎల్ వైద్య కళాశాలలో
సిమ్యులేషన్ వర్క్‌షాప్



సిమ్యులేషన్ ల్యాబ్‌లో విద్యార్థులకు వైద్య పద్ధతులను వివరిస్తున్న వైద్యులు

రాజానగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హెల్త్‌కేర్ సిమ్యులేషన్ సొసైటీ (ఎస్‌హెచ్‌ఎస్) నిర్వహిస్తున్న 6వ వార్షిక హెల్త్‌కేర్ సిమ్యులేషన్ కాన్ఫరెన్స్, సిమ్యుల్కాన్-2024 వేడుకలు జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. సదస్సు సమన్వయకర్త డాక్టర్ గన్ని సందీప్ విలేకరులతో మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లు హెల్త్ కేర్ విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించేందుకు రూపొందించామన్నారు. ఆరోగ్య విద్యలో ప్రాక్టికల్ స్కిల్స్‌ని మెరుగుపర్చడం, సిమ్యులేషన్‌లో కొత్త ప్రయోగాలను అందించడం మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సు లక్ష్యమని చెప్పారు. మొదటి రోజు వర్క్‌షాపుల్లో దేశవ్యాప్తంగా 200 మంది డెలిగేట్లు పాల్గొన్నారు. మిగిలిన రెండు రోజుల కాన్ఫరెన్స్‌లకు మరో 600 మంది హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు వీఎస్ మహాలక్ష్మి, దినకర్, లూలు షరీఫ్, ఈ.రాజ్‌కుమార్, మోహన్ మహారాజ్, జేజే డేవిడ్, అచ్యుత్, గోంగడ, ఎల్లపు రామునాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

రూ2 లక్షల మేర ఆస్తి నష్టం



పూర్తిగా కాలిపోయిన తాటాకిల్లు

ఎటపాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం కృష్ణవరం పంచాయతీ గొందిరాజుపేట (కారం వారిగుంపు)లో కారం రవి ఇంటికి గురువారం సాయంత్రం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుంది. ఆ సమయంలో రవి ఆరేళ్ల కుమార్తె అన్విత ఇంట్లో ఉంది. ఇంటిని మంటలు చుట్టుముడుతుండగా చిన్నారి గమనించి పరుగున బయటకు వచ్చి ఇరుగు పొరుగు వారికి చెప్పింది. కొద్దిసేపటికే ఇల్లు మొత్తం కాలిపోయింది. మంటల ధాటికి గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. రూ.21వేల నగదుతో పాటు బంగారు ఉంగరం, చెవికమ్మలు, బీరువా, టీవీ, గృహోపకరణాలు, సర్టిఫికెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని బాధితుడు చెప్పాడు. అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. నష్టాన్ని అంచనా వేశారు.

2,21,536

పట్టభద్రుల ఓటు హక్కుకు ఉభయగోదావరి జిల్లాల పరిధిలో పెద్ద ఎత్తున దరఖాస్తులు

ఈనెల 23న ముసాయిదా జాబితా

వచ్చే నెల 9 వరకు ఓటు నమోదుకు అవకాశం

వచ్చే నెల 30న తుది జాబితా విడుదల

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదుకు భారీఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 6వ తేదీ వరకు నమోదు చేసుకున్న వారి పేర్లను ఈ నెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ప్రచురించనున్నారు. ఈ నెల 7 నుంచి 23వ తేదీ వరకు ఒక దఫా, ఈనెల 24 నుంచి డిసెంబరు 9వరకు కూడా మరో దఫా ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. వీరందరి పేర్లు వచ్చేనెల 30న తుది జాబితాలో ప్రచురిస్తారు. ఈ నేపథ్యంలో వచ్చేనెల 9 వరకు ఓటు నమోదుకు అవకాశం ఉంది. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఓటు హక్కుకు 2,21,556 మంది నమోదు చేసుకున్నట్టు సమాచారం. అల్లూరి సీతారామరాజు జిల్లా 3,082, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 46,207, తూర్పు గోదావరి జిల్లా 42,210, ఏలూరు జిల్లా 35500, కాకినాడ జిల్లా 41754, పశ్చిమ గోదావరి జిల్లా 52893 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఓటు నమోదు అధికారి పరిశీలించి ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. అప్పటివరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మళ్లీ మరో దఫా వచ్చేనెల 9 వరకు దరఖాస్తుల స్వీకరించారు. అనంతరం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు డిసెంబరు 30న ప్రచురించే తుది జాబితాలో ఉంటాయి. ఓటు నమోదుకు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ అవసరం లేదు. సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే ఓటు నమోదు చేస్తారు. దరఖాస్తులను ఏఈఆర్వోలుగా ఉన్న తహసీల్దార్లు ధ్రువీకరిస్తే సరిపోతుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి శుక్రవారం సాయంత్రం వరకు ఓటు నమోదు చేసుకోవచ్చని ఓటు నమోదు అధికారి, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్రావు తెలిపారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఉంటే నమోదు చేసుకోచ్చన్నారు.



సామర్లకోటలో ఎంప్లాయీస్ సంఘ్ నేతల ప్రచారం

రైల్వేలో గుర్తింపు సంఘం
ఎన్నికల సందడి

డిసెంబరు 4,5,6 తేదీల్లో పోలింగ్

పోటాపోటీగా హామీలిస్తున్న ఎంప్లాయీస్ సంఘ్, మజ్దూర్ యూనియన్

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వేలో విజయవాడ డివిజన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికల సందడి నెలకొంది. డిసెంబరు 4, 5, 6 తేదీల్లో జరిగే పోలింగ్‌లో కడియం నుంచి తుని (హంసవరం) వరకు విస్తరించి ఉన్న సామర్లకోట రైల్వే సెక్షన్‌లో సుమారు 800 మంది సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇప్పటికే సామర్లకోట నుంచి కడియం వరకు సంఘ్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించగా గురువారం సామర్లకోట నుంచి హంసవరం వరకు ప్రచారం పూర్తి చేశారు. సామర్లకోట జంక్షన్ ప్రధాన కేంద్రంగా రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్‌లు కొన్ని రోజులుగా పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. చివరిసారిగా 2013లో ఎన్నికలు జరిగాయి. దశాబ్దం తర్వాత మరలా జరుగుతుండడంతో హామీలను గుప్పిస్తూ ఇరు సంఘాలు పోటాపోటీగా ఉన్నాయి.

గుర్తింపు సంఘ ఎన్నికల్లో తొలి నుంచీ సత్తా చాటుతూ వచ్చిన మజ్దూర్ యూనియన్‌పై 2013లో మాత్రం ఎంప్లాయీస్ సంఘ్ గెలిచి సంచలనం సృష్టించింది. తమ పట్టుని మరోసారి నిలుపుకోవాలని ఎంప్లాయీస్ సంఘ్, పూర్వవైభవం సొంతం చేసుకోవాలని మజ్దూర్ యూనియన్ పరస్పరం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఆయా సంఘాల జాతీయ స్థాయి నాయకులను ఆహ్వానించి మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులను వ్యక్తిగతంగా కలుసుకుంటూ మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీలకు
భావన ఎంపిక



అంతర్వేది, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో మోరిలోని జాన సుబ్బమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చెల్లుబోయిన భావన అండర్-14 బాలికల హైజంప్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు కట్టా కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. డిసెంబరు 2 నుంచి 5వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని హెచ్ఎం ఎస్.శ్రీధర్‌కృష్ణ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కట్టా కృష్ణప్రసాద్, దివ్యలను సర్పంచ్ లక్ష్మీపద్మమంగతాయారు భగవాన్, అలివేలుగంగాత్రివేణి నాని, జాన శంకరరావు, ఎంఈవోలు డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బాలిక అదృశ్యం కేసుపై డీఎస్పీ విచారణ

ప్రత్తిపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతూ అదృశ్యమైన బాలిక నెల్లి వరలక్ష్మి ఆచూకీ తెలుసుకునేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. బాలిక స్వగ్రామం గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి గురువారం సాయంత్రం ఆయన వెళ్లి తల్లిదండ్రులు నూకరత్నం, రామకృష్ణలతో మాట్లాడారు. బాలిక అదృశ్యం కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు. వీలైనంత త్వరలోనే బాలిక ఆచూకీ తెలుసుకుని అప్పగిస్తామని డీఎస్పీ భరోసా ఇచ్చారు. ఆయన వెంట సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం ఉన్నారు.



బాలిక తల్లిదండ్రులను విచారిస్తున్న డీఎస్పీ

ప్రేమ పేరుతో మోసం
యువకుడిపై
పోక్సో కేసు నమోదు

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు చెందిన 16 ఏళ్ల బాలిక 8వ తరగతి వరకు చదువుకుంది. వేసవి సెలవులకు కడియపులంకలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన యువకుడితో పరిచయం ఏర్పడింది. మాయమాటలు చెప్పి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆపై ఆమె గర్భం దాల్చింది. ఆ విషయం యువకుడికి తెలియజేయడంతో గర్భస్రావం కోసం మాత్రలు తెచ్చి ఇవ్వడగా ఈ నెల రెండో తేదీన గర్భస్రావమైంది. విషయం తెలుసుకున్న పెద్దలు బాలికను పెళ్లి చేసుకోమని కోరగా నిరాకరించడంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ చెప్పారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు
వడిశలేరు వాసి అరెస్టు

గోపాలపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దేవరపల్లి సీఐ నాగేశ్వరరావు నాయక్, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన వీరబత్తుల చంద్రశేఖర్ ఎన్నికల ముందు, ఆ తర్వాత చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్య పదజాలంతో పార్టీల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాడు. దీంతో అతడిపై గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఐటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని అరెస్టు చేశారు.

జన సాధారణ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు

సామర్లకోట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మీదుగా విశాఖ-విజయవాడ-విశాఖ మధ్య ఇటీవల ప్రవేశ పెట్టిన జన సాధారణ్ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు రద్దు చేస్తూ రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఉత్తర్వులు సామర్లకోట రైల్వే అధికారులకు గురువారం రాత్రి అందాయి. 08567 విశాఖ-విజయవాడ మధ్య, 08568 విజయవాడ-విశాఖ మధ్య నడిచే జన సాధారణ్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 8, 10, 11, 13 తేదీల్లో రద్దు చేశారు. విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఇంటర్‌లాకింగ్, సిగ్నలింగ్ వ్యవస్థ ఆధునికీకరణ పనులు చేపడు తున్న దృష్ట్యా ఈ రైళ్లను రద్దు చేసినట్టు విశాఖ రైల్వే పీఆర్వో అధికారి తెలిపారు.

ఏకీకృత పెన్షన్ విధానం అమలుకు ఒత్తిడి తెస్తాం

ఎం.రమేష్, ఎంప్లాయీస్ సంఘ్ డివిజినల్ కార్యదర్శి, సామర్లకోట

రైల్వేలో నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానానికి సమానంగా ఏకీకృత పెన్షన్ విధానం (యూపీఎస్) అమలుకు పోరాటం చేస్తాం. 8వ పే కమిషన్‌ను త్వరగా ఏర్పాటు చేయించి డాక్టర్ అక్రయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనం నెలకు రూ.32,500 ఇప్పించాలి. 2020 జనవరి నుంచి 2021 వరకు నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ, డీఆర్ తక్షణం విడుదల చేయించేందుకు పోరాటం కొనసాగిస్తాం. పీఎల్ బోనస్‌పై ఉన్న శాలరీ సీలింగ్‌ను తొలగించాలి. 12 గంటల డ్యూటీని రద్దు చేసి 8 గంటల విధానాన్ని ప్రవేశపెట్టిస్తాం. రైల్వేలో పాయింట్స్‌మెన్ కేటగిరీ-4 గ్రేడ్ పే స్ట్రక్చర్ అమలుకు రైల్వే బోర్డుతో చర్చిస్తాం. రైల్వే ఉద్యోగుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య చికిత్స, ట్రావెలింగ్ పాస్ సదుపాయాల కల్పనకు ప్రయత్నం చేస్తాం. ట్రాక్ మెయిన్‌టెనర్ల పనిగంటలు తగ్గించి భోజన విరామాన్ని డ్యూటీలో భాగంగా పరిగణించాలి. ఎన్ఎఫ్ఐఆర్ డిమాండ్ నెంబరు 1, 2022 ప్రకారం ఎల్‌డీసీఈని అందరికీ వర్తింపచేయాలి. కనీసం పాతికేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న మహిళా ఉద్యోగులు వారి పిల్లలకు ఉద్యోగం ఇచ్చే నిబంధనతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు అవకాశం కల్పించాలి.

విద్యాప్రమాణాలు పెంచే దిశగా ప్రణాళికలు

డీఎంహెచ్ స్కూల్ తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



పాఠశాలలో సదుపాయాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 7,(ఆంధ్రజ్యోతి): విద్యాప్రమాణాలు పెంచే దిశగా తమ కూటమి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరం డీఎంహెచ్ స్కూల్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్లో టాయిలెట్స్, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్యం తదితర వాటిని పరిశీలన చేసారు. అదేవిధంగా విద్యార్థులు హాజరుపట్టిని చూశారు. పాఠశాల విద్యార్థులు పాఠ్యాంశాలు, బోధన అంశాలను ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే వాటిని నా దృష్టికి తీసుకొస్తే విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్తీర్ణత శాతం పెంచాలన్నారు. ఆవరణంలో నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, నక్కా దేవి వరప్రసాద్, ఈతలపాటి రవి, మజ్జి మణికంఠ, కప్పల వెలుగుకుమారి, పోలాటి పరమేష్, నాయుడు, శనపతి సత్తిబాబు, బంగారు నాగేశ్వరరావు, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

జీజీయూలో సాంకేతిక సదస్సులు

రాజానగరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లోని వివిధ విభాగాల్లో గురువారం మూడు వర్క్‌షాపులు నిర్వహించారు. జీజీయు ఈసీఈ విభాగాధిపతి పి.వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బెంగుళూరులోని అడ్వాన్స్ మెకానికల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ (కంట్రోల్స్ అండ్ ఐఓటీ)టీఎస్ మహబూబ్ బాషా మాట్లాడుతూ వ్యాపారాలు, పరిశ్రమలు మరింత సమర్థవంతంగా పనిచేయడానికి ఐఓటీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌నకు లోకం బ్రిడ్జి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కార్పొరేట్ రిలేషన్స్ హెడ్ వై.మురళీధరరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ యువకులు స్టార్టప్‌లను ఏవిధంగా ప్రారంభించాలి, వాటిలో ఎదురయ్యే ఇబ్బందులు, అధిగమించే పద్ధతులను వివరించారు. సీఎస్ఈ ఏఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్‌రియల్ ఇంజన్‌పై నిర్వహించిన వర్క్‌షాప్ నిర్వహించారు. దీనిలో ప్రీమియర్ గేమ్ డెవలప్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ఆధారంగా 3డి గేమింగ్ ప్రపంచాలను రూపొందించేందుకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడమే ఈ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో బెంగుళూరులోని హిటాచీ గ్లోబల్ లాజిక్, అసోసియేట్ వైస ప్రెసిడెంట్ వి.శ్రీధర్, హైదరాబాదులోని ఓడీసీ ఇండియా అడ్వైసింగ్ పార్టనర్ అభిరాజ్, వినోత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు శిక్షణ



రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అండర్-17 బాల్ బాడ్మింటన్ జట్టు

బిక్కవోలు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు శిక్షణా తరగతులు గురువారం బిక్కవోలు జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పళ్లా వీరప్రభాకరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామోపా ధ్యాయులు పడాల శ్రీనివాసరెడ్డి, తొండాపు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్ల సహకారంతో ప్రకాశ్‌నగర్ పోలీస్ శాఖ, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ నెహ్రూ యువ కేంద్ర ఈస్ట్ గోదావరి ఆంధ్రప్రదేశ్ వారిచే డ్రగ్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ ఎస్.శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ఒక లక్ష్యం ఉండాలని, ఏదైనా వెహికిల్ నడిపినా క్రమశిక్షణతో నడపాలని, నేర ప్రవృత్తిని ప్రోత్సహించే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, సారా, గుట్కా, మందు వంటివి భవిష్యత్తును నాశనం చేస్తాయని వివరించారు. వ్యాసరచన పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైక్రియాటిస్ట్ సుధారాణి, యూత్ వలంటీర్ సత్య, ఎన్ఎస్ఎస్ పీవో జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు. కాగా విద్యార్థులకు ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్, వైస్ ప్రిన్సిపాల్ పీడీవీ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

పోలవరం ప్రాజెక్టుపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడొద్దు

ఎమ్మెల్యే నల్లమిల్లి



విజయవాడలో రాష్ట్ర నేతలతో ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టుపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదని రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డికి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హితవు పలికారు. గురువారం విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో వారధి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవం ప్రాజెక్టు ఎత్తు తగ్గదని ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేసినా సాయిరెడ్డికి వచ్చిన సమస్య ఏమిటో అర్థం కావడం లేదన్నారు. వైఎస్ జగన్‌కు, షర్మిలకు జరుగుతున్నది ఫ్యామిలీ వార్ అని ఆయన అన్నారు. వైసీపీ సోషల్ మీడియా వ్యక్తిత్వాలపై దాడి చేస్తోందని, కూటమి ప్రభుత్వం ఇటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. అలాగే విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనాచౌదరి నివాసంలో బీజేపీ నేతలు సమావేశమై ఈ నెల 11 నుంచి జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు అనుసరించాల్సిన వ్యూహాలు, చర్చించాల్సిన సమస్యలపై చర్చించారు. సమావేశంలో ఉక్కుశాఖ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, సోము వీర్రాజులతో కలిసి పాల్గొన్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.

15 వరకు ఐపీపీబీ అకౌంట్స్‌కు

ఎన్‌పీసీఐ యాక్టివేషన్

రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ శేషారావు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రతీ ప్రాంతీయ సచివాలయాల పరిధిలో ఈనెల 7నుంచి 15వ తేదీ వరకు అన్ని పోస్టాఫీసుల్లో పోస్టల్ డిపార్ట్మెంట్ వారు ఐపీపీబీ అకౌంట్స్‌కు ఎన్‌పీసీఐ యాక్టివేషన్ చేస్తారని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల వయస్సు పైబడిన ప్రతీ పౌరుడు సామాజిక ప్రయోజనాలు పొందడానికి డైరెక్టర్ బెనిఫిట్ ట్రాన్సఫర్ (డీబీటీ) వారి బ్యాంకు/పోస్టల్ అకౌంట్‌నకు ఎన్‌పీసీఐ లింక్‌ను యాక్టివ్ చేయించుకోవాలన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 83,5467 ఎన్‌పీసీఐ లింక్ బ్యాంక్ ఖాతాలు నిష్క్రియంగా ఉన్నాయని గుర్తించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు అకౌంట్‌లో పొందడానికి ఆధార్ సీడింగ్ తప్పనిసరి అని అన్నారు. సుమారు 9లక్షల మందికి ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్ సీడింగ్ లేకపోవడం వల్ల వాళ్లకి సంక్షేమ ఫలాలు అందే అవకాశం లేదన్నారు. ఎన్‌పీసీఐ యాక్టివేషన్‌కు సంబంధించి అకౌంట్ ఉన్న వారు ఏ పోస్టాఫీసుకైనా వెళ్లి లింక్ చేసుకోవచ్చునని తెలిపారు. పోస్టు ఆఫీసులో కొత్తగా అకౌంట్ ఓపెన్ చేసుకుంటే మూడు రోజుల్లో ఎన్‌పీసీఐ యాక్టివేషన్ అవుతుందని శేషారావు పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

డీఎంహెచ్‌వో కార్యాలయం అధికారులకు 104 వైద్య సిబ్బంది వినతి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ జీతాలను తక్షణమే చెల్లించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని 104 వైద్య సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో అధికారులకు ఒక వినతిపత్రం అందజేశారు. గత అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన మూడు నెలల వేతనం చెల్లించాలని, మూడేళ్ల నుంచి ఇవ్వని ఇంక్రిమెంట్లను తక్షనమే ఏరియర్స్ రూపంలో చెల్లించాలని కోరారు. అలాగే 104 సర్వీసులను ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారానే నిర్వహించాలని, వాహనాలకు ఫిట్‌నెస్ టీమా వెంటనే చేయించాలని కోరారు. వీటితోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

ఉండ్రాజవరం, నవంబరు 7 (నవంబరు): ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేన్సర్ వల్ల వచ్చే అనర్థాలను గురించి డాక్టర్ ప్రసాద్ వివరించారు. ఈనెల 14 నుంచి మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు స్ర్కీనింగ్‌టెస్ట్‌లు నిర్వహిస్తామన్నారు.

రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక లలితానగర్ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో రీజనల్ కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.విజయ్‌కుమార్, రాజమండ్రి రీజనల్ మేనేజరు డి.సాసయ్య ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. సత్యసేర్య వాలంటరీ బ్లడ్ సెంటర్ అండ్ బ్లడ్ కాంపోనెట్స్ వారు రక్తాన్ని సేకరించారు.

కుండీలు సరే.. మొక్కలేవి!



మొక్కలు నాటండి.. అడవులను అభివృద్ధి చెయ్యండని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పదే పదే చెబుతున్నారు. ఆయన పోరు పెడుతున్న అకీరా మియావాకీ విధానం మాట ఎలా ఉన్నా.. ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రీనరీపై కనీస శ్రద్ధ కనిపించడం లేదు. దీనికి రాజమహేంద్రవరం సబ్-కలెక్టర్ కార్యాలయం ఓ ఉదాహరణ. ఖరీదైన కుండీల్లోని మొక్కలు మాయమవగా.. ఖాళీ కుండీలు మూలకు చేరాయి. గోడకు చక్కటి చిన్నపాటి కుండీలను కూడా ఏర్పాటు చేశారు. వాటిలోని మొక్కలూ ఎండిపోయి బూజు పట్టాయి. ఈ ఎండిన మొక్కలు, ఖాళీ కుండీలను చూసిన జనం విస్తుపోతున్నారు. పచ్చటి వాతావరణం మాయమై ఎండిన మొక్కలు స్వాగతం పలుకుతుండడం చూసి నివ్వెరపోతున్నారు.
-రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)





ముందస్తు పరీక్షలతో కేన్సర్ నయం

» బిక్కవోలు పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాదేవి
» జాతీయ కేన్సర్ అవగాహన దినం
» పలుచోట్ల వైద్య సిబ్బంది ర్యాలీలు



బిక్కవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

బిక్కవోలు, నవంబరు 7: ముందస్తు పరీక్ష కాన్సర్‌కు రక్ష అని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ దుర్గాదేవి సూచించారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినం కార్యక్రమాన్ని పలుచోట్ల గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్కవోలులో డాక్టర్ దుర్గాదేవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఉచితంగా కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కేన్సర్ పట్ల నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. తమ ఏఎన్ఎంలు ప్రతిఒక్కరికీ బీపీ, షుగర్ పరీక్షలు జరిపి సలహాలు అందిస్తారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వైద్య సదుపాయాలన్నీ వినియోగించుకుని ఆరోగ్యంగా వుండాలని ఆమె సూచించారు. ర్యాలీలో ఆశా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఏవీకే చైతన్య మాట్లాడుతూ ముందుగా కేన్సర్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.రాజు, డాక్టర్ ఏసురాణి, ఎంపీహెచ్‌ఈవో సుబ్బారాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక కోటగుమ్మం సెంటర్లోని చిన్న వర్తకుల మార్కెట్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన సదస్సును నిర్వహించారు. జీఎస్ఎల్ హాస్పిటల్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ తరుణ్ గోగినేని, జిల్లా వైద్యశాఖ ఎన్‌సీడీ అధికారి డాక్టర్ జి.హరిశ్చంద్ర ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించడానికి రెడ్‌క్రాస్ సొసైటీ కృషి చేస్తోందన్నారు. కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి నరేష్‌రాజు, గొట్టిముక్కల అనంతరావు, లంక సత్యనారాయణ, మహాలక్ష్మి, శుభాకర్, రమేష్‌బాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

శిశువులకు ఇన్ఫెక్షన్లు రాకుండా

జాగ్రత్తలు తీసుకోవాలి

న్యాయ విజ్ఞాన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాష్‌బాబు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికారం తీసుకోవాలని, శిశువులకు ఇన్ఫెక్షన్లు రాకుండా జాగ్రత్త వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. శిశు సంరక్షణ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు మహిళా అభివృద్ధి శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భస్థ శిశువుల సంరక్షణ కోసం గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు ఆహారం నియమాలను వివరించారు. ప్రజలు వాటిపై పూర్తి అవగాహన వుండాలన్నారు. శిశు మరణాలు అరికట్టేందుకు సమష్టిగా అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవోలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ





వీరవరంలో పడిపూజ దృశ్యం, కొప్పవరంలో పూజలు నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

కడియం/అనపర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కడియం మండలం వీరవరం, అనపర్తి పరిధిలోని కొప్పవరం ఆధ్యాత్మికశోభ సంతరించుకున్నాయి. రెండు గ్రామాల్లో వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. వీరవరంలో 18వ శబరిమల యాత్ర సందర్భంగా గంగిశెట్టి శ్రీనివాసరావు-సత్యవేణి దంపతులు ఇంటి సమీపంలోని శ్రీకోదండరామస్వామి ఆలయం వద్ద వర్ణశోభితంగా మందిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అష్టద్రవ్యాలతో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అయ్యప్పస్వామిలకు అభిషేకాలు చేశారు. అలాగే గణపతి హోమం, అయ్యప్పస్వామి గ్రామోత్సవం జరిపారు. సాయంత్రం తాడాల వీరవెంకట్రావు గురుస్వామి పర్యవేక్షణలో అయ్యప్పస్వామికి పూలంగి సేవ, లక్ష బిల్వార్చన, పడిపూజ, అఖండ హారతి, పవళింపు సేవలు వైభవంగా జరిగాయి. గుంటూరు జిల్లా నరసారావుపేట చెందిన భజన బృందం భక్తిగీతాలు ఆలపించింది. మాలధారులకు భిక్ష, వడి ఏర్పాటు చేశారు. అలాగే అనపర్తిలోని పోతంశెట్టి ఈశ్వరరెడ్డి, పోతంశెట్టి గంగిరెడ్డి(బుజ్జి) కొప్పవరంలోని తమ రైసుమిల్లు ఆవరణలో మందిరాన్ని ఏరాటు చేసి అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లోని సుమారు 1000 మంది మాలధారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణపతితోపాటు పదునెనిమిది మెట్లకు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమాన్ని తిలకించారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రేమపెళ్లి చేసుకున్న ఒక జంట జిల్లా ఎస్పీని ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌కు చెందిన హరికృష్ణ, భూమిక కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పెద్దలు మూడేళ్ల క్రితం హరిప్రసాద్‌పై కేసులు కూడా పెట్టారు. అయితే గతనెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లిన హరికృష్ణ, భూమిక ఏలూరులో బహుజన సేవ కార్యాలయంలో బౌద్ధ ధర్మ హిందే మ్యారేజ్ యాక్ట్ ప్రకారం సామాజిక సమతా వివాహం చేసుకున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న తమ తల్లిదండ్రులు తమను చంపేస్తామని బెదిరిస్తున్నారని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్‌ను కలిసి వేడుకొన్నారు.

చక్రద్వారబంధంలో

నేడు జనవాణి

రాజానగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా మండలంలో తొలిసారిగా చక్రద్వారబంధంలో మండల స్థాయి జనవాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం తెలిపారు. మండలంలోని 33 గ్రామాల్లోని ప్రజలంతా రెవెన్యూ, విద్యుత్, పెన్షన్లు తదితర సమస్యలపై అర్జీల రూపంలో అందజేస్తే, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కార దిశగా చర్యలు చేపడతామన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి మండలంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలన్నారు.

రోడ్డును ఆక్రమిస్తే చర్యలు

కోరుకొండ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): కోరుకొండ రోడ్డు ఆక్రమణలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గురువారం సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో ఎస్ఐ జి.శామ్ సుందర్, సిబ్బంది స్థానిక కాపవరం జంక్షన్ నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణదారులపై ట్రాఫిక్ రూల్స్ వ్యతిరేకించిన వారిపై బీఎన్ఎస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు. ఇకపై రోడ్డును ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సాయిబాబాకు క్షీరాభిషేకం

కోరుకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి సాయిబాబాకు గురువారం 108 లీటర్ల పాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి సత్యనారాయణ, శ్రీదేవి దంపతులు బాబాకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన శ్రీ సాయి నర్సింగ్ కాలేజి నిర్వాహకులు గండుబోయిన వెంకట సుబ్బారావు దంపతులు భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఒకరి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరులోని మసీదులో నివాసం ఉంటున్న తాపీమేస్త్రీ పంపన రాజ్‌కుమార్ గతనెల 29న ఉదయం పనికి వెళ్లాడు. ఇంతవరకు తిరిగి రాలేదు. చుట్టుప్రక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం రాజ్‌కుమార్ భార్య పంపన అశ్విని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఉచిత ఇసుక విధానం పూర్తిగా విఫలం

» సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్భాటంగా ప్రకటించిన ఉచిత ఇసుక విధానం పూర్తిగా విఫలమైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ విమర్శించారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో వనజ విలేకరులతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని, పోలవరం నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, విశాఖ స్టీల్‌ప్లాంటు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో ప్రజలకు చెప్పాలని కోరారు. జనసేన పవన్ కల్యాణ్ ఆర్ఎస్ఎస్ భావజాలంతో వెళ్లడం సరికాదని, యువతకు ఆయన ఏ మార్గం సూచిస్తున్నారో తెలుసుకోవాలని కోరారు. ఒక పక్క మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని చెబుతున్నారని, మరోపక్క కరెంట్ ట్రూ అప్ ఛార్జీల పేరుతో భారం మోపేందుకు సిద్ధం కావడం దారుణమని అన్నారు. కూటమి ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, జిల్లా కార్యవర్గసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టుపై

పోలీసులకు ఫిర్యాదు

కడియం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టుపై పోలీసులకు ఫిర్యాదు అందింది. 'చూడ చక్కని హెరిటేజ్ పాల్' అని ఐడీతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణిల ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యంగా దూషిస్తూ మహిళలను కించపరుస్తూ వర్గాల మధ్య విద్వేషాలు రేగే విధంగా ఈనెల 7వ తేదీన పోస్టు రావడంపై టీడీపీ సోషల్‌మీడియా ఇన్‌చార్జి చెరుకరిఇ వెంకట ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు కడియం ఎస్ఐ తెలిపారు.

తప్పుడు పోస్టులు పెట్టిన

అందరిపై కేసులు పెట్టండి

మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

రంగంపేట,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియా వేదికగా రాజకీయనాయకుల పైన, ఇతరుల పైన తప్పుడు పోస్టులు పెడుతున్న అన్ని పార్టీల వారిపైనా కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి లోకేశ్‌పై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వడిశలేరుకు చెందిన వీరాబత్తుల చంద్రశేఖర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం సూర్యనారాయణరెడ్డి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ సోషల్ మీడియాపై వేధింపులు ఆపకపోతే తిరుగుబాటు తప్పదన్నారు. బాధితుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

రెండు గేదెలు, దూడలు మాయం

కడియం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తన మకాంలో ఈనెల 3వ తేదీన రాత్రి రెండు గేదెలు, రెండు దూడలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని దుళ్ల గ్రామానికి చెందిన బేదంపూడి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కడియం ఎస్ఐ బి.నాగదుర్గాప్రసాద్ తెలిపారు.

గామన్ బ్రిడ్జిపై స్కూటీ ఢీకొని

యువకుడి మృతి

మరొకరికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు శివారు గామన్ బ్రిడ్జి సమీపంలో రెండు స్కూటీలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. వెంకట నగరం గ్రామానికి చెందిన కొల్లపు రవీంద్రకుమార్ (20), అతని స్నేహితుడు ధోని బుధవారం రాత్రి బిర్యానీ కోసం రాజమహేంద్రవరం వెళ్లి వస్తుండగా గామన్ బ్రిడ్జివైపు నుంచి మరో స్కూటీపై ఎదురుగా వస్తున్న ఇద్దరు ఢీకొన్నారు. ఈ సంఘటనలో రెండు స్కూటీలకు వెనుకవైపు కూర్చున్న వారు గాయపడ్డారు. వీరిలో రవింద్రకుమార్ తలకు తీవ్రగాయమైంది. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో గురువారం మధ్యాహ్నం రవింద్రకుమార్ మృతిచెందాడు. ఈ మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



22 ఇసుక ర్యాంపులు.. 4.95 లక్షల టన్నుల ఇసుక

» కొవ్వూరులో మరో 8 డీసిల్టేషన్ ర్యాంపులు
» ఉచితంగా ఇసుక తీసుకెళ్లండి : కలెక్టర్

రాజమహేంద్రవరం, నవంబరు7(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 22 ర్యాంపుల్లో 4 లక్షల 95 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆమె ఒక ప్రకటన విడుదల చేశా రు.రాజమహేంద్రవరం అర్బన్ వినియోగదారులుకు కోటిలిం గాల ర్యాంపులో, ధవళేశ్వరంలోని గాయత్రి ర్యాంపులలో ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇంటి నిర్మాణం కోసం ఇంటి ప్లాన్, ఇతర ఇంటి మరమ్మతుల కోసం గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా ధ్రువపత్రం పొందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుక తీసుకుని వెళ్లవచ్చని చెప్పారు. కొత్తగా కొవ్వూరు డివిజన్‌లో మరో 8 డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా ఇసుక తీతకు అనుమతి ఇచ్చామని చెప్పారు. శుక్రవారం నుంచి ఇక్కడ 7,21,500 టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 16 ఓపెన్ రీచ్‌లలో 11,13,450 మెట్రిక్ టన్నుల ఇసుక ఉందన్నారు. కొవ్వూరు డివిజన్‌లో 2,52,500 టన్నులు, రాజమహేంద్రవరం డివిజన్‌లో 2,43,500 టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. కొత్తగా వాడపల్లి రీచ్‌లో 60 వేల టన్నులు,ఔరం గా బాద్-2లో 90 వేలు, ఎరినమ్మ రీచ్‌లో 37,500, కొవ్వూరులో 15 వేలు,దండగుంట రేవులో 45 వేల టన్నుల ఇసుక ఉందన్నారు.

పేదింట దీపం పెట్టారు!

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాజమహేంద్రవరంలో మహిళలు జైకొట్టారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆధ్వర్యంలో మహిళలు దీపం-2 పథకంపై పాల బిందెలు పట్టుకుని ఊరేగింపు చేశారు.ర్యాలీగా కోటిపల్లి బస్టాండ్‌కు చేరుకుని చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన దూసుకువెళుతుందన్నారు. మజ్జి పద్మావతి మాట్లాడుతూ దీపం -2 పథకం మహిళలకు ఒక వరం అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లా తనూజ, దండమూడి ప్రమీల, ముత్తాబత్తుల విజయ్,గొందేశి మాధవీలత, ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, టీడీపీ అధ్యక్షుడు మత్స్యేటి సత్యప్రసాద్, రాష్ట్ర రైతు నాయకులు మార్గాని సత్యనారాయణ, నిమ్మలపూడి గోవింద్, శీలం గోవింద్, బూరా దుర్గాంజనేయరావు, రొంపిచర్ల అంటోని, యార్లగడ్డ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో మహిళల ర్యాలీ

ఉచిత సిలిండర్లు 3,59,462 డెలివరీ

రాజమహేంద్రవరం,నవంబరు 7 (ఆంధ్రజ్యో తి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన దీపం-2 పథకం కింద జిల్లాలో ఇప్పటికే 43 ఏజెన్సీల ద్వారా ఉచిత సిలిండర్‌కు 4,02,331 బుకింగ్‌లు రాగా 3,59, 462 మందికి గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసినట్టు జేసీ ఎస్.చిన్న రాముడు తెలిపారు.ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి 31వతేదీ లోపు మొదటి ఉచిత సిలిండరు పొం దవచ్చని చెప్పారు. సిలిండర్ డెలివరీ పొందిన 48గంటల్లో సొమ్ము లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతా లో జమవుతుందన్నారు. వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1967ను సంప్రదించవచ్చని చెప్పారు.



చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చిత్రంలో గోరంట్ల



గోపవరం గ్రామశివారులో ఉన్న ఉడతల కొండ

రెవెన్యూలో అన‘కొండ’లు

» గత ప్రభుత్వంలో సబ్ డివిజన్ పేరిట భూమాయ
» గోపాలపురంలో విచారణకు ఆదేశించిన కలెక్టర్

గోపాలపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): కొండలపై కన్నేశారు.. కోట్లు దండారు.. మండలంలోని కోమటిగుంట, గంగోలు, భీమోలు, గోపవరం గ్రామాల్లో కొండలు విస్తరించి ఉన్నాయి.రెవెన్యూ అధికారులు కొందరు వ్యక్తుల పేరిట లేని భూమిని ఉన్నట్టుగా చూపించి కోట్లు దండుకున్నట్టు సమాచారం. గంగోలు మాధవాయకొండ సర్వే నెంబరు 904లో 383.80 ఎకరాల భూమి ఉండాల్సి ఉండగా సబ్ డివిజన్ల పేరుతో 106 ఎకరాలు పెంచి మాధవాయికొండను 466 ఎకరాలు విస్తరించినట్టు రికార్డుల్లో చూపించారు. కోమటిగుంట రెవెన్యూ పరిధిలో ఉన్న మాతంగమ్మ మెట్టపై సర్వే నెంబరు 1-2లో 230 ఎక రాల ప్రభుత్వ భూమి ఉంది.ఆ సర్వే నెంబర్‌లో సబ్ డివిజన్ల పేరుతో 98 ఎకరాలు పెంచి మాతంగమ్మ మెట్టను 350 ఎకరాలకు విస్తరించి రికార్డులో నమోదు చేశారు. గంగోలు పెదకొండ సర్వే నెంబరు 637లో 380 ఎకరాలు భూమి ఉండగా ఆ సర్వే నెంబర్‌లో సబ్‌డివిజన్ చేసి 200 ఎకరాలు భూమిని పెంచి ఆ కొండను 556 ఎకరాలకు పెంచారు.భీమోలుకొండ చెప్పనక్క ర్లేదు ఆయా సర్వే నెంబర్‌లో 8 నుంచి 12 వర కు సబ్‌డివజన్ల పేరుతో ఆ ప్రాంతాన్ని 15 భాగాలుగా విభజించి ఇష్టారాజ్యాంగా రికార్డులు మార్చేశారు.ఎఫ్ఎల్ఆర్‌లో ఉన్నభూమికి ప్రస్తుత రికార్డులో పెంచిన భూమికి పొంతన లేకుండా చేసేశారు.ఈ విషయం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి రావడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ప్రభుత్వం నేరుగా కలెక్టర్‌కు ఆదేశాలు ఇవ్వడంతో విచారణకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ మేరకు గత ప్రభుత్వంలో పనిచేసిన తహశీల్దార్ రవీంద్రనాథ్,డీటీ కృష్ణ, తహశీల్దార్ వనజాక్షి, డీటీ ప్రదీప్‌లపై విచారణకు ఆదేశించారు.విచారణ కమిటీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇద్దరు డీటీలను నియమించినట్టు తెలిసింది. రేపో మాపో కమిటీ రంగంలోకి దిగితే తమ భవిష్యత్తు ఏమిటోనని గత అధి కారులంతా తలలు పట్టుకుంటున్నారు. కాసు లు చెల్లించి సబ్ డివిజన్‌లో పట్టాలు పొందిన వారంతా లబోదిబోమంటున్నారు.

ఇష్టానుసారం.. ఇచ్చేశారు!



పంచాయతీల్లో అడ్డగోలు నియామకాలు

» 100 మందికి పైగా పోస్టులు
» 10 పంచాయతీల్లో ఇదీ లెక్క
» ఇక జిల్లా వ్యాప్తంగా ఎంతో?
» గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యం
» ఉన్నతాధికారుల వద్దే వివరాల్లేవ్
» ప్రభుత్వం మారినా మారని తీరు

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అధికారుల ఇష్టారాజ్యమైపోయింది..చాలా మంది ఉన్నతాధికారులకు తెలియకుండానే ప్రభుత్వ ఉద్యోగులుగా చలామణి అయిపోతున్నారు.అయినా చూస్తూ ఉండిపోవడం తప్ప ఉన్నతాధికారులు ఏం చేయలేకపోతున్నారు. జిల్లా కేంద్రంలో కలిసి ఉండే రూరల్ మండలం పరిధిలో గల 10 పంచా య తీల్లో ఎంతమంది పనిచేస్తున్నారో మండల, డివిజనల్, జిల్లా స్థాయి అధికారులకు తెలియ కపోవడమే దీనికి నిదర్శనం.. ప్రతి నెల ఈవోపీఆర్డీ ప్రతి మూడు నెలలకు డివిజనల్ పంచాయతీ అధికారి,సంవత్సరానికోసారి జిల్లా పంచాయతీ అధికారి ఆయా గ్రామ పంచాయతీలను సందర్శించి జమ ఖర్చుల వివరాలతో పాటు గ్రామంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై తనిఖీ చేయాలి. కానీ సంబంధిత అధికారులు ఆవేమి పట్టించుకోకుండా కార్యాల యాలకు రికార్డులను తెప్పించుకుని కళ్లు మూసుకుని సంతకాలు పెట్టేస్తున్నారు. దీంతో కింది స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా మారిపోయింది.ఆయా గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు, బోర్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది, బిల్లు కలెక్టర్లు, ఎలక్ట్రీషియన్లు ఉన్నారనే కనీస సమాచారం ఉండడంలేదు. అంతే కాదు ఎంత మందికి జీతాలు చెల్లిస్తున్నారో కూడా తెలియకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.ఇదే అదునుగా పంచాయతీల్లో అడ్డగోలుగా నియామకాలు జరిగిపోతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూరల్ మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో సుమారు 100 పైగా పోస్టులను సృష్టించి అధికార పార్టీ నాయకుల సిఫారసులతో కొంతమంది కార్యదర్శుల మనుషులను నియమించుకున్నట్టు సమాచారం.ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారుల నుంచి పోస్ట్ నియామక ఉత్తర్వులు తెచ్చుకున్న సంఘటనలు వున్నాయి. రూరల్ మండలం పరిధిలో సుమారు 100 మంది వరకు ఉంటారని అంచనా ఒక్క హుకుంపేట గ్రామంలోనే 2019-24 మధ్యలో 20 మందిని నియమించుకున్నట్టు తెలిసింది. అదీ నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్టు సమాచారం. ఎటువంటి అర్హత చూడకుండా ఈ నియామకాలు జరిగినట్టు తెలిసింది. హుకుంపేట పంచాయతీకి చెందిన ఒక వ్యక్తి పంచాయతీ రాజ్ కమిషనర్‌కు తమ గ్రామంలో ఇష్టానుసారంగా సిబ్బందినినియమించుకొని ప్రభుత్వదనాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ ఫిర్యాదు చేయ డంతో ఆఘమేఘాలపై గురువారం ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్ పంచాయతీలో సిబ్బంది వివరాలు తెలుసుకుంటున్నారు.దీనిపై రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవోను ప్రశ్నించగా 10 గ్రామాల్లో 629 మంది పనిచేస్తున్నట్టు చెబుతున్నారు.అయితే క్షేత్రస్థాయిలో మరి కొంత మంది అనధికారికంగా పనిచేయడం కొసమెరుపు.

మాకు సమాచారం ఉండదు..

10 పంచాయతీల్లో ఎంత మంది పనిచేస్తున్నారో ఆయా పంచాయతీ కార్యదర్శులకే తెలుస్తుంది.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శుల నుంచి లెక్క తీసుకుంటున్నాం.
- ఆర్మ్‌స్ట్రాంగ్, ఈవోపీఆర్‌డీ

మా వద్ద డేటా లేదు..

జిల్లా వ్యాప్తంగా పంచాయతీల్లో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారనే ఖచ్చితమైన డేటా మా వద్దలేదు. అవసరం మేరకు ఆయా పంచాయతీలే సిబ్బందిని నియమిస్తాయి..ఇక పంచా యతీల్లో తనిఖీ చేసి లెక్క తీస్తా.
- నాగలత, ఇన్‌చార్జి డీపీవో

డిసెంబరు 9 వరకు ఎమ్మెల్సీ ఓటు గడువు
విమానాశ్రయంలో బుల్లెట్ల కలకలం 8



చంద్రబాబుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

సీఎం చంద్రబాబుతో దళిత ఎమ్మెల్యేల సమావేశం

రాజమహేంద్రవరం,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలోని టీడీపీ , జనసేన వర్గాలకు చెందిన ఎస్సీ సామాజికవర్గ ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు గురువారం రాత్రి రాజధానిలో సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలు ఎలా అమలు చేయాలనే విషయంతో పాటు ఎస్సీ పారిశ్రామిక విధానం తదితర అంశాలపై చర్చించినట్టు సమా చారం.సమావేశానికి జిల్లా నుంచి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు,కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు.



అగరబత్తీల తయారీ శిక్షణ పరిశీలిస్తున్న కలెక్టర్

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి : కలెక్టర్

కడియం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మహిళలు స్వయం ఉపాధి రుణాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. కడియంలో వ్యర్థపూలతో అగరబత్తీల తయారీ యూనిట్‌లో శిక్షణ పొందిన మహిళలతో గురువారం కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. అక్టోబరు 20వ తేదీన పర్యావరణ పరిరక్షణ, వ్యర్థపూల నుంచి ఆదాయ వనరులుగా ఏర్పాటు చేసిన అగరబత్తీల తయారీ యూనిట్‌ను సందర్శించడం జరిగిందన్నారు. 52 మంది శిక్షణ పొందగా తొలియూనిట్ స్థాపనకు 12 మంది ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి,తహశీల్దార్ పోశియ్య, ఎంపీడీవో రమేష్, స్మాల్‌స్కేల్ డెవలప్‌మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహనకు స్ర్కీనింగ్ ముఖ్యం

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ నివారణలో స్ర్కీనింగ్ ముఖ్యం అని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడం జరుగుతున్నదన్నారు. ప్రస్తుతం కేన్సర్లలో రొమ్ము కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్, నోటి క్యాన్సర్ వంటివి సుమారుగా 34 శాతం వరకూ ఉన్నాయనే అంచనా ఉందన్నారు.ఈ నెల 14న ప్రభుత్వం లాంచనంగా నిర్వహించే గృహ సందర్శనలో ప్రజలు భాగస్వాములవ్వాలన్నారు. వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లాలో పెరిగిన పొగాకు నారుమడులు

పొగాకు నారుకు డిమాండ్
గతేడాది ధరలే కారణం
గతేడాది మూట రూ.3 వేలు
ఈ ఏడాది మూట రూ.5 వేలు
పెరిగిన పొగాకు సాగు విస్తీర్ణం

రాజానగరం,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది పొగాకు పంటకు కలిసొచ్చింది.. రికార్డు స్థాయిలో ధర పలికింది.. రైతాంగం కేజీ పొగాకు రూ. 200 దాటితే చాలని అనుకు నేవారు.. అటువంటిది ఏకంగా రూ.400లు దాటి పలకడంతో బంగారంగా మారిపోయింది. దీంతో పొగాకుకు ఎక్కడలేని డిమాండ్ వచ్చిపడింది. ఒక నాడు సాగు చేయడానికే నిరాశ కనబరిచే స్థాయి నుంచి అదే సాగు చేయాలనే పట్టుదలకు వచ్చారు. ఎందుకంటే గతేడాది ధర రైతులపై అంత ప్రభావం చూపింది.దీంతో ఎన్నడూ లేనిది పొగాకు సాగు విపరీతంగా పెరిగిపోయింది. అధికారులు వద్దన్నా వినలేదు..కాదన్నా వినలేదు. అధికారిక సమాచారం ప్రకారం వేలాది ఎకరాల్లో సాగు పెరిగినట్టు ఒక అంచనా.దీంతో పొగాకు నారుకు డిమాండ్ ఏర్పడింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో వరుస నష్టాల బాట పట్టిన పొగాకు నారు సాగు రైతుల్లో ఈ ఏడాది ఆశలు చిగురించాయి.గత రెండు,మూడేళ్లుగా పొగాకు ధర లేకపోవడంతో సాగు అంతంత మాత్రంగా ఉండేది.దీంతో నారు సాగు రైతులు కోలుకోలేని నష్టాలను చవిచూశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతాంగాన్ని పొగా కు నారుమడులు నట్టేటముంచాయి.ఈ ఏడాది వరుస తుఫాన్లు,అధిక వర్షాలు..రికార్డు స్థాయి ధర కారణంగా నారుమడులకు గిరాకీ ఏర్పడింది. గతేడాది 4 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేయగా ఈ ఏడాది 4,800 హెక్టార్లకు పెరిగి నట్టు సమాచారం. దీంతో నారుకు అమాంతం డిమాండ్ పెరిగింది.ఇతర దేశాల్లో సాగు విస్తీర్ణం తగ్గడంతో మన జిల్లాలో డిమాండ్ ఏర్పడింది. గతేడాది అవసరం మేరకు సాగు చేశారు. ఈ ఏడాది సాగు పెరగడంతో ధరపై ప్రభావం చూపుతుందని అధికారులు అంటున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం..

జిల్లాలోని మెట్ట ప్రాంతమైన రాజానగరం మండలం కలవచర్ల, దివాన్‌చెరువు, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలైన తొర్రేడు, మిర్తిపాడు, కొవ్వూరు, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లోని దొమ్మేరు,ధర్మవరం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా పొగాకు నారుమడులు కడుతున్నారు.ఇక్కడ సాగుచేసే పొగనారుకు డిమాండ్ ఎక్కువ. ఎందుకంటే నాణ్యతగా ఉం టుందని రైతులకు నమ్మకం. గతేడాది వరకూ నారుమడులు తక్కువ సంఖ్యలో కనిపించేవి.నారుమడులు కట్టినా సాగు తక్కువగా ఉండేది.ఈ ఏడాది మాత్రం నారుకు ఎగబడుతున్నారు. ఈ నేపథ్యం లో నారుమడులు పెరిగాయి. గతే డాది రూ.3 వేలు నుంచి రూ.3,500 వరకు ధర పలికింది.ఈ ఏడాది ప్రస్తుతం రూ.4 వేలు నుం చి రూ.5 వేల ధరకు చేరుకుంది. ఎగువ ప్రాం తం నుంచి రైతులు ఇక్కడకు వచ్చి నారు కొను గోలు చేసేందుకు ఎగబడుతున్నారు.ఈ ఏడాది అను కూల వాతావరణంతో తమకు లాభాలు తెచ్చిపెడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వాతావరణ పరిస్థితులు అనుకూలం



ఈ ఏడాది పొగాకు నారు మడుల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. గత రెండు, మూడేళ్లుగా ఆశించిన లాభాలు రాకపోగా తీవ్రంగా నష్టపోయాం. ఈ ఏడాది రైతులు ఆశించినట్టుగానే సాగుతోంది. నారుమడులు చీడ పీడలు కూడా దరిచేరలేదు.
- పిల్లా రామకృష్ణ, కౌలు రైతు, కలవచర్ల

నారు ధర బాగుంది..



గతేడాది మూట (6 వేల మొక్కలు) రూ.2 వేలు నుంచి రూ.3 వేలు ఉండేది. ప్రస్తుతం మూట రూ.5 వేలు వరకు ధర పలు కుతోంది. ఎకరం విస్తీర్ణంలో నారుమడులు కట్టాలంటే రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షల వరకు ఖర్చవుతుంది.నష్టాలు గట్టెక్కింటేలా ఉన్నాయి.
- ఆదం సత్యనారాయణ, రైతు కలవచర్ల

మూడేళ్లుగా వరుస నష్టాలే..



నారుమడుల సాగుతో గత రెండు, మూడేళ్లుగా వరుస నష్టాలు బారిన పడ్డాం. ఈ ఏడాది బాగానే ఉంది. కలవచర్లలో ప్రస్తుతం సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో నారు సాగు చేస్తున్నారు. విత్తనాలు చల్లిన నాటి నుంచి నారు తీతకు రావడానికి 45 రోజులు పడుతుంది.
- సబ్బు బాపిరాజు, కౌలు రైతు కలవచర్ల



చక్రద్వారబంధంలో కొనుగోలు చేసిన నీటిని పట్టుకుంటున్న ఇంటి యజమాని

నీళ్లు కావాలంటే.. పని మానుకోవాల్సిందే!

చక్రద్వారబంధంలో తాగునీటి ఇక్కట్లు

రాజానగరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చెంతనే గోదావరి..అయినా తాగునీటికి ఇక్కట్లు తప్పడం లేదు..తాగునీరు కావాలంటే అప్రమత్తంగా ఉండాల్సిందే.ఎందుకంటే రోజులో ఎప్పుడొస్తుందో ఏమో తెలియదు.. ఒక వేళ వస్తే వెంటనే పట్టుకోవాలి.. తరువాత మళ్లీ నీరెప్పుడొస్తుందో తెలియదు..గ్రామంలో మరికొన్ని ఏరియాల్లో అయితే పనులు మానుకుని నీటి కోసం కాపలాకాసేవారు కొందరైతే, ట్రాక్టర్ల ట్యాంకర్ల ద్వారా రూ.800లకు నీటిని కొనుగోలు చేసుకుంటున్న వారు మరికొందరు. ఇలా ఎవరు స్థాయిలో వారు తాగునీటి వెతలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇదెక్కడో మారుమూల అనుకుంటే పొరబడినట్టే.. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో విలీన ప్రతిపాదన ఉన్న రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామంలో దుస్థితి ఇది.. చెంతనే గోదావరి ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో తాగు నీటిని కొనుగోలు చేసుకుని దాచుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. చక్రద్వారబంధం గ్రామంలో మూడు బోర్లు ఉన్నప్పటికీ గ్రామంలో అన్ని ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీరందడం లేదు.ఈ నేపథ్యంలో తాగునీటితో పాటు వాడకం నీటిని కూడా కొనుగోలు చేసుకుంటున్నారు. పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంతో ప్రజలు నలిగిపోతున్నారు. పంచాయతీలో నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో విలీన ఉత్తర్వులతో గ్రామా భివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. వెంకటనగరం పంపింగ్ స్కీమ్ ద్వారా గోదావరి జలాలకు పైపు లైను ఉన్నా నీరందని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి, గ్రామంలో నెలకొంటున్న తాగునీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని పలువురు వేడుకుంటున్నారు.



కొవ్వూరువాసుల పెద్ద మనసు

కొవ్వూరు నియోజకవర్గ ప్రజల నుంచి విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ. 90,54,999ల చెక్కును గురువారం రాజధానిలో సీఎం నారా చంద్రబాబు నాయుడికి అందజేస్తున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కందమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి తదితరులు. - కొవ్వూరు

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు శిక్షణ

బిక్కవోలు నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-17 బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుకు శిక్షణా తరగతులు గురువారం బిక్కవోలు జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో హెచ్ఎం పళ్లా వీరప్రభాకరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు పడాల శ్రీనివాసరెడ్డి, తొండాపు రాఘవరెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక లలితానగర్ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో రీజనల్ కార్యాలయంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. విజిలెన్స్ ఆఫీసర్ ఎస్.విజయ్‌కుమార్, రాజమండ్రి రీజనల్ మేనేజరు డి.సాసయ్య ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. సత్యసేర్య వాలంటరీ బ్లడ్ సెంటర్ అండ్ బ్లడ్ కాంపోనెట్స్ వారు రక్తాన్ని సేకరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 11కేవీ గోదావరి బండ్ ఫీడర్‌పై విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నిడదవోలు డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. పట్టణంలోని క్రిస్టియన్‌పేట, శ్రీరామ కాలనీ, రాజీవ్‌కాలనీ, స్పెక్ జెహెచ్‌సీ కాలనీలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. మధ్యాహ్నం 1గంట తరువాత విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ఎలక్ట్రికల్ పట్టణ ఏఈ డి.జగదీశ్వరరావు తెలిపారు.

నిడదవోలు: పట్టణంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వార్షిక మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ తెలిపారు. రామ్‌నగర్, గణేష్‌చౌక్, ఓవర్‌బ్రిడ్జి, పోలీస్‌స్టేషన్, గాంధీబొమ్మ సెంటర్, బసివిరెడ్డిపేట అన్నపూర్ణ నగర్ ఏరియాలలో కలిగే విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

దేవరపల్లి: దేవరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన సౌండ్ ఫీడర్ నిమిత్తం దేవరపల్లిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ తెలిపారు. మండలంలోని అచ్చయ్యపాలెం, బంధపురం, గొల్లగూడెం, ఇండస్ట్రీయల్ ఫీడర్ ఉదయం 9నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని నిడదవోలు ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని మసీదులో నివాసం ఉంటున్న తాపిమేస్త్రీ పంపన రాజ్‌కుమార్ 2024 అక్టోబరు 29న ప్రతిరోజు మాదిరిగా ఉదయం 8గంటలకు తాపీ పనికి వెళ్లాడు. ఇంతవరకు తిరిగి రాలేదు. చుట్టుప్రక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గురువారం రాజ్‌కుమార్ భార్య పంపన అశ్విని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్తీక అన్నసమారాధన

దేవర పల్లి, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి షిరిడీ సాయిబాబా ఆలయంవద్ద కార్తీకమాసం తొలి గురువారం కావడంతో ఆలయంవద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు ఆలయ అర్చకులు అగ్నిహోత్రం సత్యనారాయణ ఆచార్యులు నిర్వహించారు. సాయంత్రం కార్తీకదీపాలను భక్తులు వెలిగించారు. బాబాకు పంచహారతులు ఇచ్చారు. పల్లకీసేవా నిర్వహించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కిరణ్‌కుమార్ ఎంపిక



చాగల్లు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవలపల్లి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మట్టా కిరణ్‌కుమార్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ అండర్-14 విభాగంలో ఎంపికైన ఇతను ఈనెల 9వతేదీ నుంచి 11వరకు బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొంటాడు. ఈసందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారుడు కిరణ్‌కుమార్‌ను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కొయ్య గంగాధరరావులను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ముత్యాల లక్ష్మీనారాయణ, స్కూల్ ఉపాధ్యాయులు, స్కూల్ ఎస్ ఎంసీ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు అభినందించారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా మునికోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం



మునికోటేశ్వరరావును అభినందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా నియమితుడైన అక్కిన ముని కోటేశ్వరరావు గురువారం తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్, కొంతమంది సభ్యులు బుధవారమే ప్రమాణ స్వీకారం చేయగా, గురువారం కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన కుటుంబ సభ్యులతో కలసి హాజరయ్యారు. తాను ఊహించని విధంగా తనకు స్వామికి సేవ చేసే అవకాశం వచ్చిందని, మంచిగా సేవ చేస్తానని ఆయన తెలిపారు.

సాయిబాబాకు క్షీరాభిషేకం

కోరుకొండ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి సాయిబాబాకు గురువారం 108 లీటర్ల పాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి సత్యనారాయణ, శ్రీదేవి దంపతులు బాబాకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన జీవీ సుబ్బారావు దంపతులు భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

'ప్రమాదకర క్యాన్సర్‌ను జయిద్దాం'

నల్లజర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) అవగాహన కల్పించి ప్రమాదకర క్యాన్సర్‌ను జయిద్దాం అంటూ నల్లజర్లలో వైద్య ఉద్యోగులు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవ ర్యాలీ నిర్వహించారు.గురువారం ప్రభుత్వ ఆసుపత్రి అవరణంలో ఆరంభం అయిన ఈ ర్యాలీ నల్లజర్లలో అన్ని ప్రధాన వీధుల గుండా సాగింది.కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి తెల్లం గంగధర్‌రావు మాట్లాడుతూ క్రమంతప్పని వైద్య పరీక్షలతో క్యాన్సర్‌ను దూరం చేయ్యవచ్చు అన్నారు.మంచి అలవాట్లు ఆరోగ్యకరమైన ఆహారంతో క్యాన్సర్‌ను ఎదుర్కోందామని ఆదనపు వైద్యులు డాక్టర్ సిరాజుద్దీన్ పిలుపునిచ్చారు.వ్యాధి లక్షణలను గుర్తించి అవగాహన కలిగించడం,సమర్థవంతమైన చికిత్స విధానాలు గుర్తించి తెలియజేయ్యాలని సిహెచ్‌వో పల్లివెల ప్రసాదరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు జి.వి.విప్రసాద్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నల్లజర్లలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య బృందం

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

ఉండ్రాజవరం, నవంబరు 7 (నవంబరు): ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవ గాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వలన వచ్చే అనర్థాలను గురించి డాక్టర్ ప్రసాద్ వివరించారు. ఈనెల 14 తేదీ నుంచి మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు నినాదాలు చేశారు. సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల పరిధిలో కూరగాయలు పండించాలి'

నల్లజర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) అంగన్‌వాడీ పరిధిలో 10సెంట్లు ఖాళీ స్థలాన్ని ఏర్పాటు చేసుకుని కూరగాయలు,ఆకుకూరలు పండించి అంగన్‌వాడీకి వచ్చే గర్భిణీలు,బాలింతలకు,చిన్నారులకు పోషణ ఆహారం అందించాలని ఏసిడిపీవో పద్మావతి అన్నారు.గురువారం నల్లజర్ల సీడీపీవో కార్యాలయంలో పోషణ వాటిక కార్యక్రమం నిర్వహించారు.ఐసీడీయస్ సిబ్బంది, సేంద్రియ వ్యవసాయ శాఖ,ఎన్ఆర్‌జీయస్ సిబ్బందికి గ్రామాల్లో కేటాయించిన 10సెంట్ల స్థలంలో ఏ మొక్కలు వేసుకోవాలి,ఎరువుల ఏలా తయారు చేసుకోవాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు.రసాయనలు లేని ఆహారం అందించేందుకు జిల్లా కలెక్టర్ ప్రసంతి ప్రత్యేక కార్యక్రమంగా శనివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.మనం పండించిన కూరగాయలు,ఆకుకూరలు చిన్నారులకు,గర్భిణీ,బాలింతలు పెట్టడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు.పోషణ వాటికను ప్రతి కేంద్రంలో శనివారం ప్రారంభించాలన్నారు.అందరు సమిష్టి కృషితోనే కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సుమర్‌వైజర్లు వెంకటలక్ష్మి,శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీడీపీవో పద్మావతి

నేడు మండల సర్వసభ్య సమావేశం

గోపాలపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవో పీఎస్ఎస్ శ్రీనివాస్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 2.30గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలాధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయ తీ కార్యదర్శులు సమావేశానికి హాజరుకావాల్సిందిగా కోరారు.

కోతుల పట్టివేత



గోపాలపురంలో పట్టుకున్న కోతులు

గోపాలపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతులను పట్టుకునే కార్యక్రమం చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి అనురాధ గురువారం తెలిపారు. రెండు రోజులుగా ఇతర ప్రాంతాల్లో ఉన్న కోతులను పట్టేవారిని రప్పించి కోతులను పట్టిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు సుమారు 50 కోతులను పట్టుకున్నారన్నారు. పట్టుకున్న కోతులను నల్లజర్ల అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని అన్నారు.

బీజేపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకుడు

● సొంత గూటికి చేరుకున్న సలాది సందీప్

కొవ్వూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరుకు చెందిన వైసీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్ బీజేపీ కండువా కప్పుకున్నారు. గురువారం కొవ్వూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు ఆధ్వర్యంలో సందీప్‌కుమార్‌ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందీప్ 2018లో వైసీపీలో చేరి బూత్ కమిటీ పట్టణ మేనేజర్, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడిగా పదవులు చేపట్టారు. పార్టీ విధానాలపై విసుగు చెంది 2024 జనవరి 21న తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామ చేసి అప్పటి నుంచి స్తబ్దతగా ఉన్నారు. గురువారం కొవ్వూరులో బీజేపీ కండువా కప్పుకున్నారు. సొంతగూటికి సందీప్ రావడంతో పలువురు నాయకులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ఎం. ఆంజనేయులు, ముప్పరాజు శ్రీనివాసరావు, సాయిరాజు, కరుటూరి జగన్, శివకృష్ణ పాల్గొన్నారు.



బీజేపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకుడు సలాది సందీప్‌కుమార్

రామకృష్ణ, వివేకానందుల భక్త సమ్మేళనం

నిడదవోలు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలోని లయన్స్ ఆడిటోరియంలో నేటి నుంచి ఆదివారం వరకు మూడు రోజులపాటు శ్రీ రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భక్త సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమ్మేళనంలో ప్రముఖ స్వామీజీలు మాతాజీలు పాల్గొంటారని శ్రీ రామకృష్ణ, వివేకానంద భక్తులు సుమారు రెండువేల మందికిపైగా రానున్నారని కమిటీ తెలిపింది.



నిడదవోలులో శ్రీ రామకృష్ణ పరమహంస మఠం

ఓటు హక్కును ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలి

చాగల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన విద్యావంతులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. చాగల్లు, కలవలపల్లి, చిక్కాల, బ్రాహ్మణగూడెం, దారవరంలలో ఎమ్మెల్యే పర్యటించి ఎమ్మెల్సీ ఓటు నమోదు తీరును అడిగి తెలుసుకన్నారు. టీడీపీ నాయకులతోను మాట్లాడి ఈనెల 9వ తేదీ వరకు నమోదు గడువు పెంచినందున విద్యావంతులు నిర్లక్ష్యం వీడి ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని కోరారు.



చాగల్లు తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటు నమోదు తీరును పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

విమానాశ్రయంలో కలకలం



ప్రయాణికుడి వద్ద దొరికిన బుల్లెట్లు, బ్యాగ్

ఆరు బుల్లెట్లతో ప్రయాణికుడు అరెస్టు

కేసు నమోదు..కొనసాగుతున్న దర్యాప్తు

కోరుకొండ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): మధురపూడి విమానాశ్రయంలో బుధవారం రాత్రి ప్రయాణికుడి వద్ద దొరికిన బుల్లెట్లు తీవ్ర కలకలం రేపాయి. కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయానికి బుధవారం రాత్రి విజయవాడకు చెందిన ఎం.సుబ్బరాజు హైదరాబాద్ వెళ్లేందుకు వచ్చాడు. ఆయన తన లగేజ్‌తో టెర్మినల్ భవనంలోకి వెళ్లే సమయంలో ఆయన వద్ద బుల్లెట్లు ఉన్నట్టు స్కానింగ్‌లో వెల్లడైంది. వెంటనే అప్రమత్తమైన ఎస్‌పీఎఫ్ సిబ్బంది ప్రయాణికుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. బుల్లెట్లు స్వాధీనం చేసుకుని బుధవారం అర్ధరాత్రి కోరుకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే తనకు లైసెన్స్ గన్ ఉందని, తుపాకీ లోడ్ చేస్తున్న సమయంలో కొన్ని బుల్లెట్లు తన వద్ద ఉండిపోయాయని వాటిని చిన్న బ్యాగ్‌లో ఉంచి మర్చిపోయానని సుబ్బరాజు పోలీసులకు తెలిపాడు. బుల్లెట్లను, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయ నిబంధనల ప్రకా రం బుల్లెట్లతో ప్రయాణించడం, దానికి తగిన అనుమతులు తీసుకోకపోవడంతో ఆయనపై గురువారం ఉదయం కేసు నమోదు చేసినట్టు కోరుకొండ ఎస్ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు. బుల్లెట్లు స్వాధీ నం చేసుకుని సుబ్బరాజుకు స్టేషన్ బెయిల్ ఇచ్చి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దర్యాప్తులోని అంశాలను అనుసరించి తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలివ్వాలి

జిల్లా కాంగ్రెస్ కమిటీ బృందం..తాడిపర్రు మృతుల కుటుంబాలకు పరామర్శ



తాడిపర్రులో సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉండ్రాజవరం, నవంబరు 07 (నవంబరు): తాడిపర్రులో విద్యుత్ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయాలని కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ నాయకులు తాడిపర్రులోని మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రమాదంలో నలుగురు వ్యక్తులు మృతి చెందడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభు త్వం ఉపాధి కల్పించాలన్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని బృందం పరిశీలించింది. కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు మార్టిన్‌లూథర్, రాష్ట్ర కార్యదర్శి చిన్నం మురళీ కృష్ణ, ఎ.అరుణకుమారి, ఎం.భద్రం దొర, కేఆర్‌కేవీపీ చౌదరి, బుద్దన లక్ష్మణరావు, షేక్ ఖాసిమ్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

మహాయాగ విజయోత్సవ రథయాత్ర

ఉండ్రాజవరం, నవంబరు 07 (నవంబరు) మండలంలోని పాలంగి గ్రామంలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆప్తవాజపేయ మహాయాగం సందర్భంగా గురువారం రాత్రి విజయోత్సవ రథయాత్ర నిర్వహించారు. యాగ నిర్వాహకులు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ రథయాత్రలో యాగ దీక్షాధారులు, వివిధ ప్రాంతాల ఉంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. సన్నాయి వాయిద్యాలు, బ్యాండు మేళాలు, బాణాసంచాతో రథయాత్ర కన్నుల పండువగా నిర్వహించారు. యాగ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రేమపెళ్లి చేసుకున్న ఒక జంట జిల్లా ఎస్పీని ఆశ్రయించింది. వివరాల్లోకి వెళితే రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌కు చెందిన హరికృష్ణ, భూమిక కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పెద్దలు మూడేళ్ల క్రితం హరిప్రసాద్‌పై కేసులు కూడా పెట్టారు. అయితే గతనెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లిన హరికృష్ణ, భూమిక ఏలూరులో బహుజన సేవ కార్యాలయంలో బౌద్ధ ధర్మ హిందే మ్యారేజ్ యాక్ట్ ప్రకారం సామాజిక సమతా వివాహం చేసుకున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న తమ తల్లిదండ్రులు తమను చంపేస్తామని బెదిరిస్తున్నారని జిల్లా ఎస్పీ నరసింహకిషోర్‌ను కలిసి వేడుకొన్నారు.

రెండు గేదెలు, దూడలు మాయం

కడియం, నవ ంబరు 7(ఆంధ్రజ్యోతి): తన మకాంలో ఈనెల 3వ తేదీ రాత్రి రెండు గేదెలు,దూడలను దుండగులు దొంగిలించుకుపోయారని దుళ్ల గ్రామానికి చెందిన బేదంపూడి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

2,21,536

పట్టభద్రుల ఓటు హక్కుకు ఉభయగోదావరి జిల్లాల పరిధిలో పెద్ద ఎత్తున దరఖాస్తులు

ఈనెల 23న ముసాయిదా జాబితా

వచ్చే నెల 9 వరకు ఓటు నమోదుకు అవకాశం

30న తుది జాబితా విడుదల

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదుకు భారీఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 6వ తేదీ వరకు నమోదు చేసుకున్న వారి పేర్లను ఈ నెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ప్రచురించనున్నారు. ఈ నెల 7 నుంచి 23వ తేదీ వరకు ఒక దఫా, ఈనెల 24 నుంచి డిసెంబరు 9వరకు కూడా మరో దఫా ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. వీరందరి పేర్లు వచ్చేనెల 30న తుది జాబితాలో ప్రచురిస్తారు. ఈ నేపథ్యంలో వచ్చేనెల 9 వరకు ఓటు నమోదుకు అవకాశం ఉంది. ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఓటు హక్కుకు 2,21,556 మంది నమోదు చేసుకున్నట్టు సమాచారం. అల్లూరి సీతారామరాజు జిల్లా 3,082, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 46,207, తూర్పు గోదావరి జిల్లా 42,210, ఏలూరు జిల్లా 35500, కాకినాడ జిల్లా 41754, పశ్చిమ గోదావరి జిల్లా 52893 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఓటు నమోదు అధికారి పరిశీలించి ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తారు. అప్పటివరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. మళ్లీ మరో దఫా వచ్చేనెల 9 వరకు దరఖాస్తుల స్వీకరించారు. అనంతరం దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు డిసెంబరు 30న ప్రచురించే తుది జాబితాలో ఉంటాయి. ఓటు నమోదుకు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ అవసరం లేదు. సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే ఓటు నమోదు చేస్తారు. దరఖాస్తులను ఏఈఆర్వోలుగా ఉన్న తహసీల్దార్లు ధ్రువీకరిస్తే సరిపోతుంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి శుక్రవారం సాయంత్రం వరకు ఓటు నమోదు చేసుకోవచ్చని ఓటు నమోదు అధికారి, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్రావు తెలిపారు. అర్హత ఉన్న ఉపాధ్యాయులు ఉంటే నమోదు చేసుకోచ్చన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు

వడిశలేరు వాసి అరెస్టు

గోపాలపురం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, నారా లోకేశ్‌లపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని గోపాలపురం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దేవరపల్లి సీఐ నాగేశ్వరరావు నాయక్, ఎస్ఐ కె.సతీష్‌కుమార్ వివరాల ప్రకారం.. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన వీరబత్తుల ఎన్నికల ముందు, ఆ తర్వాత చంద్రశేఖర్ చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి, అసభ్య పదజాలంతో పార్టీల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్‌చేస్తున్నాడు. దీంతో అతడిపై గోపాలపురం మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేశాడని అన్నారు. దీంతో ఐటీ యాక్ట్ ప్రకారం.. కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని అరెస్టు చేశామన్నారు.

విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టుపై పోలీసులకు ఫిర్యాదు

కడియం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టుపై పోలీసులకు ఫిర్యాదు అందింది. 'చూడచక్కని హెరిటేజ్ పాల్' అని ఐడీతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, భువనేశ్వరి, బ్రాహ్మణిల ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యంగా దూషిస్తూ మహిళలను కించపరుస్తూ వర్గాల మధ్య విద్వేషాలు రేగే విధంగా ఈనెల 7వ తేదీన పోస్టు రావడంపై టీడీపీ సోషల్‌మీడియా ఇన్‌చార్జి చెరుకరిఇ వెంకట ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు పై కడియం ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు దర్యాపు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కుండీలు సరే.. మొక్కలేవి!



మొక్కలు నాటండి.. అడవులను అభివృద్ధి చెయ్యండని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పదే పదే చెబుతున్నారు. ఆయన పోరు పెడుతున్న అకీరా మియావాకీ విధానం మాట ఎలా ఉన్నా.. ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రీనరీపై కనీస శ్రద్ధ కనిపించడం లేదు. దీనికి రాజమహేంద్రవరం సబ్-కలెక్టర్ కార్యాలయం ఓ ఉదాహరణ. ఖరీదైన కుండీల్లోని మొక్కలు మాయమవగా.. ఖాళీ కుండీలు మూలకు చేరాయి. గోడకు చక్కటి చిన్నపాటి కుండీలను కూడా ఏర్పాటు చేశారు. వాటిలోని మొక్కలూ ఎండిపోయి బూజు పట్టాయి. ఈ ఎండిన మొక్కలు, ఖాళీ కుండీలను చూసిన జనం విస్తుపోతున్నారు. పచ్చటి వాతావరణం మాయమై ఎండిన మొక్కలు స్వాగతం పలుకుతుండడం చూసి నివ్వెరపోతున్నారు.

-రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)



